ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 5 జూలై 2025



స్పౌజ్ పింఛన్ల సొమ్ము వెనక్కి!

కలువాయి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా మంజూరైన స్పౌజ్ (భర్త మరణిస్తే భార్యకు ఇచ్చే) పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును అధికారులు తిరిగి ప్రభుత్వ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కలువాయి మండలంలో 80 స్పౌజ్ పింఛన్లు మంజూరవగా, ఆయా పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమ చేసింది. అయితే, అనూహ్యంగా ఈ పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులు శుక్రవారం ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. పింఛన్లు సొమ్ము చేతికి వస్తుందని ఎంతో ఆశగా ఎదురుసిన వితంతువుల ఆశలు ఆవిరయ్యాయి.

అమ్మ ఒడి.. ఈ సర్కారు బడి!

నాడు 71 మంది..
నేడు 107 మంది పిల్లలు



కొత్తగా చేరిన పిల్లలతో ఉపాధ్యాయులు

చదువే లక్ష్యం, జ్ఞానం.. చదువే ధైర్యం.. గమ్యం!... అంటూ గురువులు చేసిన హితబోధ ఆ సర్కారు బడికి విద్యార్థులు 'క్యూ' కట్టేలా చేపింది. సెలవుల్లో ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, ఏడాదికేడాదికీ పెరుగుతున్న ఉత్తీర్ణత శాతంపై ఉపాధ్యాయులు ఇచ్చిన భరోసా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చింది. ప్రైవేటు బడుల్లో ఫీజుల దెబ్బకు అల్లాడిపోతున్న తల్లిదండ్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానాలు, సరికొత్త సంస్కరణలు కొండంత ధైర్యం నింపుతున్నాయి. మనుబోలు మండలంలోని ఆరు ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడమే ఇందుకు నిదర్శనం. ఈ ఆరింటిలోనూ ఈ విద్యా సంవత్సరంలో పెరిగిన విద్యార్థుల శాతంతో మనుబోలు సీఎంనగర్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో ఈ పాఠశాలలో 71 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 107 మంది చదువుతున్నారు. ఒకప్పుడు విద్యార్థులు లేక వెలవెలబోయిన ఈ సర్కారు బడి.. నేడు నిండుగా కళకళలాడుతోంది. హెచ్ఎం రాణి ఆధ్వర్యంలో నలుగురు ఉపాధ్యాయులు పిల్లల నమోదు ప్రక్రియలో శ్రద్ధ వహించడంతో ఈ మోడల్ స్కూల్ మండలంలో టాప్‌లో నిలిచింది.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

గురుకుల్లాలో ఔట్‌సోర్సింగ్ టీచర్లకు
గౌరవ వేతనం పెంపు



నెల్లూరు (హరనాథపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 12 గిరిజన సంక్షేమ గురుకులు ఉండగా, 2,944 విద్యార్థులు చదువుతున్నారు. 79 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉండగా, ఒక్కొక్కరికి రూ.14,800 గౌరవ వేతం అందుతోంది. ఈ వేతనం రూ.19,350 లకు పెరిగింది. ఆ విద్యాలయాల్లోనే పోస్టు గ్రాడ్యుయేట్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ముగ్గురు పని చేస్తున్నారు. వీరికి ప్రస్తుతం రూ. 16,100 వేతనం ఉండగా, 24,150లకు పెరిగింది. నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో నెల్లూరు, చిత్తూరు, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాలు ఉండగా, 45 గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 9,708 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గ్రాడ్యుయేట్ టీచర్లు 268, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు 25మంది, జూనియర్ లెక్చరర్లు 11 మంది పని చేస్తున్నారు. కాగా, జూనియర్ లెక్చరర్లు జిల్లాలో లేకపోయినా తిరుపతి జిల్లాలో ఉన్నారు. వీరికి గౌరవవేతనం రూ.18వేల నుంచి 24,150 లకు పెరిగింది. ఐటీడీఏ పీడీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, అందుకు తగ్గట్టు ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయయులకు గౌరవవేతనం పెంచడం అందరిలో ఆనందం నింపినట్లు అయ్యిందని అన్నారు.

ముంపు రహిత నగరం

నెల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరాన్ని ముంపు రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నగరం మొత్తం డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించేందుకు నిర్ణయం తీసుకుంది. పెద్ద, చిన్న అని తేడా లేకుండా అన్ని కాలువలకు లైనింగ్ చేసి మురుగు పారుదల సాఫీగా సాగేలా అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇరిగేషన్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ విభాగాలు ఈ పనులు చేపట్టనున్నాయి. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఆమోద ముద్ర వేస్తోంది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ.155 కోట్లతో కాలువలను బాగు చేసే పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే అమృత్-2 పథకం కింద డ్రెయిన్ల నిర్మాణానికి అనుమతులు రాగా, ఇరిగేషన్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక పబ్లిక్ హెల్త్ నుంచి ఉత్తర్వులు వెలువడడమే మిగిలి ఉంది. నగరం మీదుగా పదుల సంఖ్యలో ప్రధాన పంట కాలువలు వెళుతున్నాయి. వీటికి అనుబంధంగా అనేక బ్రాంచ్ కాలువలున్నాయి. అయితే చాలా వరకూ ఆక్రమణలకు గురికావడంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరు నగరం నుంచి బయటకు వెళ్లడం చాలా కష్టంగా మారుతోంది.

- నెల్లూరులో కాలువల అభివృద్ధికి నిర్ణయం
- రూ.47.83 కోట్లు మంజూరు చేసిన ఇరిగేషన్ శాఖ
- రూ.62 కోట్లతో పబ్లిక్ హెల్త్ ఎస్టిమేషన్లు సిద్ధం
- రూ.46 కోట్లతో అమృత్-2 కింద డ్రెయిన్ల నిర్మాణం
- త్వరలో టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు

● రూ.170 కోట్లతో ప్రతిపాదనలు

వర్షపు నీరు, మురికి నీటిని నగరం బయటకు తీసుకెళ్లే ప్రతి కాలువకు లైనింగ్ ఏర్పాటు చేసి బెడ్ నిర్మించేందుకు ఇటీవల అధికారులు ఎస్టిమేషన్లు వేశారు. ఇందుకు దాదాపు రూ.170 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఈ క్రమంలో రూ. 50 కోట్లతో ఇరిగేషన్ శాఖ పనులు చేసేలా ప్రతిపాదించగా, మరో 62 కోట్లతో పబ్లిక్ హెల్త్ విభాగం పనులు చేసేలా నిర్ణయించారు. ఇరిగేషన్ శాఖకు ప్రతిపాదనలు వెళ్లగా రూ.47.83 కోట్లతో అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పబ్లిక్ హెల్త్ విభాగం రూ.62 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. కాగా అమృత్-2 పథకం కింద నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రూ.46 కోట్లతో డ్రెయిన్లను నిర్మించనున్నారు. డ్రెయిన్లు లేని శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఈ నిధులను ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. అమృత్-2 నిధులు, ఇరిగేషన్ శాఖ నిధులతో త్వరలోనే కాలువల అభివృద్ధికి టెండర్లు పిలవనున్నారు. త్వరలోనే కాలువల పనులకు టెండర్లు పిలుస్తామని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ తెలిపారు. అమృత్-2 కింద రూ.46 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానిస్తామని మున్సిపల్ కమిషనర్ వైవో నందన్ వెల్లడించారు. ఇక రూ.62 కోట్లతో ఎస్టిమేషన్లు రూపొందించామని, ప్రభుత్వం నుం చి ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నామని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఉత్కంఠ.. ఉద్రిక్తత!

ఎట్టి పరిస్థితుల్లోనూ పచ్చని పొలాలను ఇండో సోల్ సోలార్ పరిశ్రమ పరిశ్రమకు ఇచ్చేదేలేదు.. అవసరమైతే అధికారులను నిలదీద్దామంటూ కరేడు గ్రామస్థులు, రైతుల ఆక్రోశం..

ప్రజలకు ఏమని చెప్పి భూసేకరణకు ఒప్పించాలి. కర్షకుల ఆగ్రహం ఎటు దారి తీస్తుందోనని అధికార యంత్రాగం ఆందోళన..


గ్రామసభలో తన వాదనను అధికారులకు వివరిస్తున్న మహిళ

- కరేడులో రసాభాసగా గ్రామసభ
- భూములు ఇచ్చేదేలేదన్న రైతులు, గ్రామస్థులు
- బెడిసికొట్టిన అధికారుల వ్యూహం
- చేసేదిలేక అర్ధంతరంగా సభ ముగింపు
- ప్రజల మాటలనే ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రకటన

వెరసి కరేడు గ్రామంలో శుక్రవారం క్షణక్షణం ఉత్కంఠగా మారింది. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కందుకూరు, కావలి డివిజన్లకు చెందిన 100 మందికిపైగా పోలీసులను ఉదయాన్నే గ్రామంలో మోహరింపజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ రెవెన్యూ సిబ్బందితో కలిసి కరేడు గ్రామానికి చేరుకున్నారు. వీరు వేదికపై కూర్చొనేలోపే 'చావనైనా చస్తాం కానీ మా భూములు మాత్రం వదులుకోం. మాకు గ్రామ సభలు అవసరం లేదంటూ రైతులు పెట్టిన గగ్గోలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఒకదశలో రైతులను అదుపు చేయడం పోలీసులకు కూడా సాధ్యం కాలేదు. ముఖ్యంగా సముద్ర తీర గ్రామాల మత్స్యకార మహిళలు 'ఏటా రెండుకార్లు పంటలు పండించే భూములు, తిండికి కరువైన నాడు మమ్మల్ని ఆదుకున్నా. అలాంటి భూములను వదులుకునే ప్రసక్తే లేదంటూ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

● ఎలాగైనా సభ నిర్వహించాలని..

ప్రభుత్వం నిర్దేశించిన టాస్కను పూర్తి చేసి ఇండోసోల్ పరిశ్రమ కోసం విడుదల చేసిన భూసేకరణ చేయాలని అధికారులు ప్రయత్నం గ్రామస్తుల తిరుగుబాటు ముందు పని చేయలేదు. గ్రామస్థులు, రైతులు, మహిళలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. కనీసం ప్రభుత్వం ఏం చెప్పాలనుకుందో వివరించేందుకు ప్రయత్నించినా ప్రజలు ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇలాగే కొనసాగితే పరిస్థితులు చేయి దాటిపోతాయని గ్రహించిన అధికారులు రైతుల ఆగ్రహానికి తలవంచక తప్పలేదు.


రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, సబ్‌కలెక్టర్ శ్రీపూజ

● మీ మాటలనే నివేదిస్తాం

స్థానికంగా ఉన్న రైతులు, మత్స్యకారులు, శివారు గ్రామాల ప్రజల మనోభావాలను దెబ్బతీసి వారి జీవనోపాధికి భంగం కలిగించే భూసేకరణపై మీ మాటలనే యధావిధిగా ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు హామీ కూడా ఇవ్వడంతో రైతులు శాంతించారు. అధికారులు కూడా గ్రామసభను ముగించి, తిరుగుప్రయాణమయ్యారు.

- ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)


గ్రామసభలో రైతులను నిలువరిస్తున్న పోలీసులు

రైతులకు అండగా ఉంటా : తూమాటి



పార్టీలకు అతీతంగా కరేడు రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ తూమాటి మాదవరావు అన్నారు. గ్రామసభలో రైతులు, గ్రామస్థుల ఆవేదనను ప్రత్యక్షంగా చూసిన ఆయన మాట్లాడుతూ రైతులు, గ్రామస్థులకు అండగా తాను కూడా తన పరిధిలో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఇటీవల కరేడు రైతులు, గ్రామస్థులు చేపట్టిన హైవే దిగ్బంధంపై పోలీసులు 38 మందిపై కేసులు బనాయించడం దారుణమని అన్నారు. ఆ కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సబ్‌కలెక్టర్ శ్రీపూజను కోరారు. తనవంతుగా హోం మంత్రి, డీజీపీలను కలిసి రైతులపై పెట్టిన కేసులపై చర్చించి తీయించే విధంగా కృషి చేస్తానన్నారు.


అధికారుల సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

సమన్వయంతో రొట్టెల పండుగను
విజయవంతం చేయండి

భక్తులకు ఏలోటూ రానీయొద్దు
అధికారుల సమీక్షలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగలో విధులు కేటాయించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. పండుగ జరిగే ఐదు రోజులూ 24/7 విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించాలని, సదరు వివరాలను జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ఘాట్‌ల నిర్వహణలో అలసత్వం వహించొద్దని, అవసరమైనన్ని సీసీటీవీలు అమర్చుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం మెరుగు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కలగకుండా చర్యలు తీసుకోవాలని, వైద్య, ఆరోగ్య శాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. దర్గా ప్రాంగణంలో ప్రణాళిక ప్రకారం స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లతో ఆయన కలిసి దర్గా, స్వర్ణాల చెరువు వద్ద ఘాట్‌లను, బారికేడ్‌ల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

11 నుంచి రెవెన్యూ క్రీడలు

● 3 రోజులపాటు నెల్లూరులో నిర్వహణ 8

ఇక టీచర్ల హాజరుపై గురి

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బడుల్లో ఉండాల్సిందే!
- యాప్‌లో నమోదు తప్పనిసరి
- పక్కాగా పాఠశాలల మార్గదర్శకాలు అమలు

పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై గురిపెట్టాలి. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే యాప్‌లో హాజరు నమోదు చేయాలి. 9.30 గంటలకు హాజరు నివేదిక తనకు సమర్పించాలి. బోగస్ హాజరు నమోదు కాకుండా డీఈఓతోపాటు డిప్యూటీఈఓలు, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు సమావేశాలు నిర్వహించి హాజరుపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి. జూలై 10 తరువాత నా తనిఖీల్లో బోగస్ హాజరు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు.

- విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షలో పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు


యాప్‌లో అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఉపాధ్యాయుల సమయ పాలనపై విద్యా శాఖ దృష్టి సారించింది. విద్యార్థులకు కిట్ల పంపిణీ, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జూలై 1వ తేదీ నుంచి పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ రూపొందించే మార్గదర్శకాలను అమలు చేయనున్నారు. త్వరలోనే టీచర్లకు ఫండమెంటల్ లెర్నింగ్ పేరుతో శిక్షణ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లంతా ఉదయం 9 గంటలకే పాఠశాలలకు హాజరు కావాలని, సాయంత్రం 4 గంటల వరకు ఖచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు, విద్యార్థి హాజరు పూర్తి చేయాలి. ప్రక్రియ పూర్తి చేయకపోతే వెంటనే ఎంఈఓ నుంచి సమాచారం తెప్పించుకోవాలి. పాఠశాలల్లో సమావేశాలు సాయంత్రం 4 గంటల తరువాతనే నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

● జీతాలకు లైన్ క్లియర్

జిల్లాలో జరిగిన ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు, పాఠశాలలకు బదిలీ అయిన హెచ్ఎంలు, ఉపాధ్యాయుల జీతాలు చెల్లించేందుకు లైన్ క్లియర్ అయినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల కొత్త కేడర్ స్ట్రెంగ్త్ డీఈఓ కార్యాలయం ఐటీసెల్‌కు వచ్చింది. ఆన్‌లైన్‌లో ఏ టీచర్ పాఠశాల నుంచి ఏ పాఠశాలకు బదిలీ అయిన వివరాలు, టీచర్ల ట్రెజరీ ఐడీ నెంబర్ కూడా ఉండడంతో నిర్ధారణ తేలికగా పూర్తి చేశారన్నారు. కొత్త కేడర్ వివరాలను ధ్రువీకరించి పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం నుంచి ట్రెజరీ కార్యాలయానికి పంపించామన్నారు. ఈ వివరాలు డీటీఏ నుంచి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరుతున్నాయని, వెంటనే జీతాల బిల్లుల మంజూరుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా యూపీ స్కూల్స్ నుంచి అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లోని హెచ్ఎం, టీచర్లకు సంబంధించి కొత్తగా డీడీఓ కోడ్ నెంబర్లను కేటాయిస్తురు. అలాగే ఆదర్శ పాఠశాలల్లో పీఎస్‌హెచ్ఎంలు, ఎస్‌జీటీల వివరాలన్నీ అప్‌డేట్ చేస్తున్నారని, అందరికీ ఈనెలలోనే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు.

● కమిషనర్ ప్రతిరోజూ సమావేశం

పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ నిత్యం ఉదయం పది గంటలకు ఆర్జేడీలు, డీఈఓలు, డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలతో జులై 1వ తేదీ నుంచి వెబెక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ సిబ్బంది, టీచర్లు సమయపాలన పాటించి పాఠశాలల ఉన్నతికి పాటుపడాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జూలై 1వ తేదీ జిల్లాలో 97.5 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)

పంటలకు బీమా..
రైతులకు ధీమా

ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగకు వర్తింపు

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశగ పంటలకు బీమా చేసుకునే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణం పొందిన వారికి బీమా నేరుగా లభిస్తుంది. రుణాలు పొందని రైతులు తుపాన్లు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే వాతావరణ అంశాల ఆధారంగా బీమా పరిహారం చెల్లిస్తారు. వరి, వేరుశనగకు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులతోపాటు కౌలు రైతులూ అర్హులని అధికారులు తెలిపారు.

● ప్రీమియం ఇలా..

వరి పంటకు సంబంధించి గ్రామ యూనిట్‌గా రైతులు ఎకరాకు రూ.840 చెల్లించాలి. ప్రకృతి వైపరీత్యాల నష్టం వాటిల్లితే బాధిత రైతుకు రూ.42,000 చెల్లిస్తారు. ఆగస్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఇక వేరుశనగకు మండల యూనిట్‌గా ఎకరాకు రూ.280 ప్రీమియం చెల్లించాలి. రూ.28వేల పరిహారం చెల్లిస్తారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి రైతులను కోరారు.

నేడు వీరంపల్లికి ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

మనుబోలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి పంచాయతీకి శనివారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే వస్తున్నారని, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9328
వెండి కిలో ధర	రూ. 110500
వెండి ఒక గ్రాము	రూ. 113.50

తహసీల్దారు సారు కోసం..

నాలుగు రోజులుగా రైతుల ఎదురుచూపు



మనుబోలు తహసీల్దార్ కార్యాలయం

మనుబోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా అధికారులు తహసీల్దార్ కార్యాలయంకు తహ సీల్దార్ రాకపోవడంతో గ్రామాలనుంచి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన రైతులు, మహిళలు ఎదురుచూసి వెళ్ళిపోతున్నారు. మంగళవారం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి రావడం లేదు. రెండు రోజులుగా డిప్యూటీ తహసీల్దార్ కూడా రావడం లేదు. పదిరోజులుగా కంప్యూటర్ ఆపరేటర్ రావడం లేదు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు చివరికి సీనియర్ అసిస్టెంట్‌తో తమ సమస్యలు మొరపెట్టుకుని వెళ్ళిపోయారు. తహసీల్దారుతో సహా ముఖ్య అధికారులు రోజులతరబడీ కార్యాలయానికి రాకపోవడంతో పలువురు రాజకీయ నాయకులు, రైతులు విసిగిపోయారు. తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా ఆర్‌డీవో కార్యాలయంలో రీ సర్వే పనులు చేయిస్తున్నామని, అందుకే కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని చెప్పారు.

కండలేరు నీటి మట్టం 32.326 టీఎంసీలు

రాపూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 32.326 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2180 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 70 క్యూసెక్కులు మొత్తం 2320 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఏఈ తెలిపారు.

కసుమూరులో ఏర్పాట్లు పూర్తి

వక్ఫ్‌బోర్డు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్



వెంకటాచలం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన కసుమూరు దర్గాకు రొట్టెల పండుగ సందర్భంగా లక్షలాది మంది భక్తులు తర లివస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వక్ఫ్‌బోర్డు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్ తెలిపారు.

? రొట్టెల పండుగ ఏర్పాట్ల కోసం వక్ఫ్‌బోర్డు నుంచీ ఏ మేరకు నిధులు మంజూరయ్యాయి

! దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఏర్పాట్ల కోసం వక్ఫ్‌బోర్డు రూ.5 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. వీటితో ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, షామియానాలు, లైటింగ్, మరుగుదొడ్లు, క్యూలైన్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

? భక్తుల కోసం ఏర్పాట్లు ఎలా

!ఈ ఏడాది పార్కింగ్ నుంచి దర్గా వరకు వృద్ధులు, మహిళలు, పిల్లల కోసం ఉచితంగా ఆటోలను ఏర్పాటు చేస్తున్నాం. గత మూడేళ్ల నుంచి నిర్వహిస్తున్నాం. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వినూత్నంగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నాం. ఈ ఏడాది ఆటోల సంఖ్య పెంచాం.

? దర్గాలో ఆంక్షలేవైనా పెడుతున్నారా?

! దర్గాలో ప్రత్యేకించి వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మస్తాన్ స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేకమైన క్యూ ఏర్పాట్లు చేస్తున్నాం. దర్గాతో పాటు ప్రాంగణం, పరిసరాలపై వక్ఫ్‌బోర్డు పర్యవేక్షణ నిత్యం ఉండేలా చర్యలు తీసు కుంటున్నాం. రొట్టెల పండుగకు 5 లక్షల మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

? గతంలో దర్గాలో బలవంతపు వసూళ్లు జరిగాయి కదా?

! ఈసారి దర్గాలో బలవంతపు వసూళ్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భక్తులను ఇబ్బంది పెట్టేలా ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే పోలీసులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం. దర్గాతోపాటు పరిసరాలలో భక్తు లకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తాం.

పంట కాదు .. ప్రవహించే కాలువ..



వేగూరు- మోడేగుంట గ్రామాల మధ్యనున్న పొలాలకు సాగునీరం దించే వేగూరు కాలువ ఇది. పంట కాలువలో బుడగ తామర ఏపుగా పెరిగి పంటను తలపిస్తోంది. చాలా కాలంగా వేగూరు కాలువకు పూడిక తీయకపోవడంతో బుడగ తామర బాగా పెరిగిపోయింది. పెద్ద తోటలా కనిపిస్తోంది. సాగు నీరు అందించే కాలువలో పూడిక తీయించాలని రైతులు కోరు తున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో జరిగిందంతా దోపిడీనే!

'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఎమ్మెల్యే సోమిరెడ్డి


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

వెంకటాచలం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో సర్వేపల్లి నియోజక వర్గంలో దోపిడీ, అవినీతి, అక్రమాలు తప్ప... అభివృద్ధి జరగలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని తాటిపర్తి పాళెంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. వైసీపీ ఐదేళ్లలో భూ కుంభకోణాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులలో విచ్చలవిడిగా దోపిడీ చేసిందన్నారు. భూకబ్జాలయితే చెప్పనవసరం లేదని ఆరోపించారు. కాలువల్లో పూడిక తీయకుండానే రూ.150 కోట్లు దోచేశారని విమర్శించారు. చివరకు సిమెంటు రోడ్లు, సైడ్ కాలువ పనుల్లో కూడా విపరీతంగా దందాలు చేశారన్నారు. 15 ఏళ్ల కిందట తాము నిర్మించిన సిమెంట్ రోడ్లు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, వైసీపీ నేతలు మూడేళ్ల కిందట వేసిన సిమెంట్ రోడ్లు దారుణంగా తయారయ్యాయ న్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలపాటు సర్వేపల్లి నియో జకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పని చేశారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా రన్నారు. సర్వేపల్లిలో గత ఐదేళ్లలో అభివృద్ధి పేరుతో అరాచకం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ ఎన్నికల పరిశీలకుడు దావా పెంచలరావు, టీడీపీ మండలా ధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున రెడ్డి, నిక్కుదల రమేష్, యన మల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు


కొళాయిల్లో సరఫరా అవుతున్న తాగునీరు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలు గ్రామంలో గ్రామ పంచాయతీ తాగునీటి బోరు దెబ్బతిని నీరు కలుషి తమౌతోంది. కొళాయిల్లో కలుషిత నీటి సరఫరాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మాజా కాదు... బ్రో.. 'పంచాయతీ నీళ్ళ' మాయాజాలం' వార్తకు ఎంపీడీఓ నారాయణరెడ్డి స్పందించారు. సెక్రటరీ విజయకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సిబ్బందితో కలిసి ఆయన శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. దెబ్బతిన్న బోరును పరిశీలించారు. బోరు పైపునకు మరమ్మ తులు చేసి మంచినీరు సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధే మా నినాదం: ఎమ్మెల్యే


కరపత్రాల్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే నినా దంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు సుపరి పాలన అందిస్తున్నామని ఎ మ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జగదేవిపేట, డేవిస్‌పేట గ్రామాల్లో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్య క్రమాన్ని చంద్రబాబు ఓ యజ్ఞంలా నిర్వహిస్తున్నారని చెప్పారు. అవినీతిరహిత కోవూరు నియోజకవర్గమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాల్ని ఆమె ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ కోవూరు అభివృద్ధికి కృషి చేస్తున్న వేమిరెడ్డి దంపతుల్ని అభినందించారు. వీపీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, కోడూరు కమలాకరరెడ్డి, తన్నీరు మధు, కూకటి వేంకటేశ్వర్లు, కుదురు రాఘయ్య, బొల్లినేని హరినాయుడు, రవినాయుడు పాల్గొన్నారు.

'నదుల అనుసంధానం జరగకుండా కుట్రలు'



పొదలకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నదుల అనుసంధానానికి అవరోధాలు కల్పిస్తూ కాం గ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కు ట్రలు చేస్తున్నాయని బీజే పీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన నిరసన తెలి పారు. అనంతరం తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఓట్ల రాజకీయం కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రాంతీయ విబేధాలు సృష్టిస్తు న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాలో ప్రాజె క్టులకు అనుమతులు రాకుండా కాలయాపన చేసే విధంగా తెలంగాణ ఇంజనీర్లు సీడబ్ల్యూసీ ఇంజ నీరింగ్‌ను ప్రభావితం చేస్తున్నారన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం నదుల అను సంధానాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మండ లాధ్యక్షుడు పూల ప్రశాంత్, నేతలు చింతగింజల సుబ్రహ్మణ్యం, ధనుంజయ, సురేంద్ర గురుస్వామి, శ్రీహరి, జనార్దన్, కొండయ్య, శ్రీహరి రంగారావు, తరుణ్‌కుమార్, జనసేన మండలాధ్యక్షుడు దాసినేటి అనిల్, నేతలు ఆనంద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరిస్తున్నారా..?


తనిఖీ చేస్తున్న జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహన్‌రావు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తు న్నారా? లేక మీరే వెళ్ళి చెత్త కుండీల్లో వేస్తు న్నారా? అంటూ జిల్లా పంచాయతీ ముఖ్య కార్య నిర్వహణాధికారి జే. మోహన్ రావు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మం డలంలోని పెనుబల్లి గ్రామ పంచా యతీలో చెత్తసేకరణ, ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానికులకు ఐవీ ఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పిం చారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వే రుగా గ్రీన్ అంబాసిడర్స్‌కు అంద జేయాలని తెలిపారు. పీ.4 సర్వే గురించి సూచనలిచ్చారు. లబ్ధిదా రుల వివరాలపై ఆరా తీశారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీ లించారు. ఎంపీడీఓ నారాయణరెడ్డి, సర్పంచు పెంచలయ్య, ఎంపీటీసీ నారాయణ తదితరులున్నారు.

కామాక్షితాయికి వైభవంగా పల్లకీ సేవలు



బుచ్చిరెడ్డిపాళెం, జూలై4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం రాత్రి కామాక్షితాయికి పలకీసేవలు వైభవంగా జరిగాయి. ముందుగా అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. అదే విధంగా కామాక్షితాయికి భక్తులతో సామూహిక కుంకు మార్చన నిర్వహించారు. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామివారికి ఆలయ పురోహితుడు గొల్లనపల్లి శ్రీధర్‌శర్మ సాంప్ర దాయబద్ధంగా చేసిన నిత్య కళ్యాణోత్సవం భక్తులను అలరించింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ముం దుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థినికి సన్మానం

రాపూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణానికి చెందిన విద్యార్థిని రేపూరు నిషిత స్రవంతి ఈసెట్-2025 ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంకు సాధించినందుకు జెమ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ పాఠశాల కరస్పాండెంట్ బుల గాకుల మునీంద్ర రెడ్డి, స్కూల్ హెడ్ మాస్టర్ పిల్లకదుపు నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాపూరమ్మకు పొంగళ్లు



రాపూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రాపూరమ్మ తల్లికి శుక్రవారం పొంగళ్ల కా ర్యక్రమాన్ని గ్రామ స్థు లు భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. ఈ సంద ర్భంగా మహిళలు పాల పొంగళ్లను అమ్మవారికి నైవే ద్యంగా సమర్పించారు.

దాతల సహకారంతో శ్మశాన వాటిక అభివృద్ధి

రాపూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీకి శ్మశానవాటిక లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సహకారంతో శ్మశానవాటికకు స్థలం సమకూర్చుకున్నారు. రాపూరు సర్పంచ్ భర్త భూపతి జయరామయ్య రహదారి నిర్మాణానికి ట్రాక్టర్లతో మట్టి తోలించి, శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. దీంతో ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


దారి ఏర్పాటు చేస్తున్న నాయకులు

'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు'

విడవలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చౌకిచర్ల, దంపూరు గ్రామ సర్పంచులు అరగల వినోద్, సురేంద్రరెడ్డి తెలిపారు. ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం చౌకిచర్ల, దంపూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో స్థానిక టీడీపీ నాయకులు తూళ్లూరు మాదవ్, కొండా రఘు, తిరుపతిలు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా? అని తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓగు నాగేశ్వరరావు, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, దూది విజయరాఘవన్, ఈదూరు సురేష్, గర్రోటి హరిప్రసాద్ పాల్గొన్నారు.


చౌకిచర్లలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

C.R.I.M.E N.E.W.S

మహిళపై దాడి : కేసు నమోదు

జలదంకి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన మహిళ మక్కెన రాజేశ్వరిపై అదే గ్రామానికి చెందిన వాకాటి వేణుగోపాల్ దాడిచేసిన సంఘటన గురువారం రాత్రి బికె అగ్రహారం సమీపంలో జరిగింది. బాధిత మహిళ ఆటోలో ప్రయాణిస్తుండగా బికె అగ్రహారం సమీపంలోని జువ్విచెట్టుపాలెం వద్ద వేణుగోపాల్ ఆటోను ఆపి రాజేశ్వరిని కిందకు లాగి దాడిచేసి సెల్‌ఫోన్‌ను పగులగొట్టాడు. తాను ఫోను చేస్తే ఎందుకు ఎత్తవు అంటూ ప్రశ్నిస్తూ తనపై దాడి చేశాడని బాధిత మహిళ గురువారం రాత్రి జలదంకి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు శుక్రవారం నిందితుడు వేణుగోపాల్‌పై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

దగదర్తి (బిట్రగుంట) జూలై 4 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి పడి గాయపడి కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై జంపానికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై తెలిపారు. వైద్యం నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు వైద్యుల ద్వారా తెలిసిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం


నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

బిట్రగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. చెంచులక్ష్మీపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి ఇద్దరు వ్యక్తులు రెండు ప్లాస్టిక్ క్యాన్లలో 15 లీటర్ల నాటుసారా తీసుకువెళ్తుండగా వెంబడించగా వల్లకి యోహాన్ పరార్ కాగా, అతని భార్య లక్ష్మీప్రసన్నను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద ఉన్న సారాను స్వాధీనపరుచుకున్నామని, కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. ఈ దాడులో నెల్లూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ అనితరెడ్డి, నెల్లూరు, కావలి ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

2 మోటారు బైక్‌ల ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

సంగం (ఆంధ్రజ్యోతి): సంగం - జాతీయ రహదారి కూడలి పీహెచ్‌సీకి ఎదురుగా రెండు మోటారు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. చేజర్ల మండలం మాముడూరు గ్రామానికి చెందిన జయరామయ్య సంగం జాతీయ రహదారి కూడలి నుంచి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటారు బైక్ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొంది. దీంతో జయరామయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందచేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి) : సింగపూర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురుని మోసం చేసిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. డ్రైవర్స్‌కాలనీలో షఫీ అహ్మద్ నివాసం ఉంటున్నారు. ఆయనకు మూడేళ్ల కిందట తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన షేక్ అహ్మద్ మొహిద్దీన్‌తో పరిచయం ఏర్పడింది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆయన షఫీఅహ్మద్, ఆయన కుమారుడు అమ్జాద్, అల్లుడు మీరామొహిద్దీన్‌లను నమ్మించి వారి నుంచి పలు దఫాలుగా రూ.7.50 లక్షల ఫోన్‌పే చేయించుకున్నాడు. వారి వరిజనల్ పాస్‌పోర్టులు, సర్టిఫికెట్లను తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు అహ్మద్ మొహిద్దీన్‌ను ఫోన్‌లో ప్రశ్నించాడు. దీంతో ఇటీవల ఆయన ఫోన్ నెంబరు మార్చేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా : ఇద్దరు మహిళలకు గాయాలు

సైదాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మైనింగ్ పనుల కోసం కూలీలను తరలి స్తున్న ఆటో శుక్రవారం బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. సైదాపురం దళితవాడ నుంచి పది మంది కూలీలను జోగిపల్లి ప్రాంతంలోని మైనింగ్ పనుల కోసం తరలిస్తున్న సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలివెళ్ళారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం, ఆంధ్ర జ్యోతి) : అక్రమంగా గంజాం యని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను జీఆర్‌పీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నిందితుల వివరాలను రైల్వే డీఎస్పీ మురళీధర్ శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గం జాయి అక్రమ రవాణా అరికట్టడం లో భాగంగా నెల్లూరు, గూడూరు, కావలి రైల్వే స్టేషన్‌లలో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారన్నారు. అందులో భాగంగా నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో నాల్గొవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌పై ఎస్ఐ జీ మాలకొండ య్య సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా టాటానగర్- ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి దిగిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిష్ణు షబ్బర్, మైనర్ బాలుడు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో రైల్వే సీఐ సుధాకర్, ఎస్ఐ హరిచందన, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరురూరల్ : అప్పుల బాధను తట్టుకోలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన గురువారం రాత్రి నెల్లూరురూరల్లో జరిగింది. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలివెలపాళెంకు చెందిన చానుబాషా(43) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అప్పుల బాధను తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సమాచారం అందడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఐడీ

నెల్లూరు(క్రైం), జూలై 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీసీ కె.శ్రావణ్‌కుమార్ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 2వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు ఐడీ క్రియేట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 590

'జడ్పీ'లో మొక్కలు నాటిన బ్యాంక్ సిబ్బంది

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : కెనరాబ్యాంక్ రీజనల్ ఆఫీస్, లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్ మాట్లాడుతూ కెనరాబ్యాంక్ 120 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, బ్యాంక్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనార్దనరెడ్డి కాలనీ, అలంకార్ సెంటర్, రామయ్యబడి ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి!

● భక్తులకు అన్ని రకాల సదుపాయాలు
● డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా
● 'ఆంధ్రజ్యోతి'తో నెల్లూరు ఆర్డీవో అనూష



నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష తెలిపారు. ఆదివారం నుంచి ఐదురోజులపాటు జరిగే పండుగ ఏర్పాట్లపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? పండుగ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి.

! రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి నెల రోజుల క్రితమే రొట్టెల పండుగ ఏర్పాట్లపై యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకున్నాము. దాని ప్రకారం అన్ని శాఖల సమన్వయం తో ఏర్పాట్లు పూర్తి చేశాము. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయం.

? వాహనాల పార్కింగ్ ఎలా.

! నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా లక్షలాది వాహనాల పార్కింగ్ చేసుకొనేందుకు వీలుగా నగర శివారు ప్రాంతాలు కేటాయించాము. డీమార్ట్ పక్కన ఉన్న సైన్స్‌పార్క్, ఎన్టీఆర్ నగర్‌లోని ఎస్‌వీజీఎస్ కళాశాల వద్ద, డీఎస్ఎన్ ఫంక్షన్ హాలు వద్ద, ప్రసారభారతి వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు.

? ఈసారి ఎంతమంది భక్తులు రావచ్చు.

! గతేడాది దాదాపు 10 లక్షలు మంది భక్తులు విచ్చేశా రు. ఈ ఏడాది దాదాపు 16 లక్షల మంది రావొచ్చని అం చనా వేస్తున్నాము. రద్దీకి తగ్గట్టుగా మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాటు చేశాము.

? బందోబస్తు ఎలా.

! లక్షలాది మంది వచ్చే భక్తుల కోసం నగరంతోపాటు దర్గా ప్రాంగణంలోనూ పోలీసులతో గట్టి నిఘా పెట్టాము. ముఖ్యంగా స్వర్ణాలచెరువు, దర్గా చుట్టు పక్కల హైక్వాలిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. ఈసారి డ్రోన్ కెమెరాలనూ వినియోగిస్తున్నాము. వీటితోపాటు వేలాది మంది పోలీస్‌లు 24 గంటలూ విధుల్లో ఉండేలా చర్యలు చేపడుతున్నాము.

? భక్తులకు సదుపాయాలు ఎలా.

! లక్షలాది మంది తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాము. కార్పొరేషన్ అధికారులతో కలిసి శానిటేషన్ చర్యలు చేపడుతున్నాము. లైటింగ్, ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా మంచి నీటి సదుపాయం, బయోటాయ్‌లెట్స్, స్నానపు గదులు ఏర్పాటు చేశాము. చెరువులో భక్తుల రక్షణ కోసం కంచె ఏర్పాటు చేశాము.

? పాసుల మంజూరు ఎలా

! దర్గా పరిసరాల్లో ఉండే స్థానికులకు ఈ ఏడాది పాస్‌లు ఇవ్వడం లేదు. ఆధార్ కార్డులోని చిరునామాను చూసి పోలీసులు వారి వాహనాలను అనుమతిస్తారు. పాస్‌లను పరిమితిగా ముద్రించాము.

యాక్షన్‌ప్లాన్‌తో సమగ్రాభివృద్ధి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 4(ఆంధ్రజ్యోతి): యాక్షన్ ప్లాన్‌తో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకర్గ విజన్-2047 యాక్షన్‌ప్లాన్ అమలుపై నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రూరల్ నియోజకవర్గం విజన్-2047 యాక్షన్‌ప్లాన్ అమలు బాధ్యతను నెల్లూరు ఆర్డీవో అనూషకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో ఆమె ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షా సమావేశం పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా 14 అంశాలను నియోజకవర్గ పరిధిలో గుర్తించామన్నారు. వీటిలో ఇప్పటికే ఆమంచర్లలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు పూర్తి చేశామన్నారు. పొట్టేపాళెం కలుజులపై బ్రిడ్జ్ నిర్మాణం, గాంధీనగర్‌లో షాదీమంజిల్ నిర్మాణం ఇలాంటి ముఖ్యమైన 14 అంశాలు యాక్షన్ ప్లాన్‌లో ఉన్నాయన్నారు. వీటిని త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నెల్లూరు ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి విజన్ యాక్షన్‌ప్లాన్-2047 అమలుకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. పీ-4లో భాగంగా ఎమ్మెల్యే సూచనలతో ఇద్దరిని బంగారు కుటుంబంలో సభ్యులుగా చేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మాలానందబాబా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి మహావిద్యాలయంలో ఎన్‌సీసీ ప్రారంభం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రగతి మహావిద్యాలయం పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కమాండర్ గణేష్‌గొండంగేవ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ పట్ల విద్యార్థులు నిబద్ధతతో ఉండాలని, క్రమశిక్షణతో సాధన చేసి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఎన్‌సీసీ ద్వారా శారీరక దృఢత్వంతో పాటు దేశభక్తి, సమాజసేవ పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీకి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ముకుంద, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీరంజన్, కరస్పాండెంట్ బెజవాడ ప్రత్యూష, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాది సంబరం.. నాలుగేళ్ల లక్ష్యంతో 'తొలిఅడుగు'

● మంత్రి పొంగూరు నారాయణ



ప్రభుత్వ మంచిని వివరిస్తూ మహిళకు అభివాదం చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 4(ఆంధ్రజ్యోతి) : గడిచిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన మంచితో పాటు రానున్న నాలుగేళ్ల లక్ష్యాలూ నిర్దేశించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 49వ డివిజన్‌లో ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీర్చుతున్నామని, ఉచిత గ్యాస్ వల్ల నిరుపేదలకు ఆర్థిక లబ్ధి చేకూరిందని తెలిపారు. తల్లికి వందనంతో అనేక మందికి ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం సమకూర్చినట్లు వెల్లడించారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబోతున్నట్లు తెలిపారు. అన్న అన్నదాత సుఖీభవ పేరిట మూడు దశల్లో రూ. 20 వేలు రైతులకు అందచేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్లపాక అనురాధ, ఖాదర్‌బాషా, వందవాసి రంగా, బండి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ హంగులు

నెల్లూరు(విద్య) : నగరంలోని 14 ఉన్నత పాఠశాలలకు కార్పొరేట్ తరహాలో అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించి మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్ హైస్కూల్‌ను సిద్ధం చేశామని, ఇదే తరహాలో మరో 14 హైస్కూల్స్‌ను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నా మన్నారు. విద్యావస్థలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. నగరంలోని 6వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుకుంటున్నారని, వారికి మెరుగైన విద్యను, వసతులను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నెల్లూరు చేరుకుంటారని, 7న ఉదయం 9 గంటలకు వీఆర్ హైస్కూల్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం అనిల్ గార్డెన్స్‌లో జరిగే టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని సాయంత్రం బారాషహీద్ దర్గాను సందర్శించిన అనంతరం రాత్రికి తిరుపతికి వెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మంచి చేసే ముఖ్యమంత్రిని ఆశీర్వదించండి

● 'తొలి అడుగు' కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి



కరపత్రం అందచేసి ప్రభుత్వ మంచిని వివరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు

నెల్లూరురూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రి చంద్రబాబును ఆశీర్వదించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 34వ డివిజన్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఏడాది పూర్తయిన కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు వెళ్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని బాగు చేయాలి, ప్రజలకు మేలు చేయాలని నిత్యం సీఎం చంద్రబాబు తపిస్తుంటాడని కొనియాడారు. అలాంటి ముఖ్యమంత్రిని వదులుకోవద్దని, మన సారా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, తద్వారా ఏర్పాటు కాబోతున్న ఉపాధి అవకాశాలను ప్రజలకు వెల్లడించారు. తల్లికివందనం పథకం పేద కుటుంబాలలో ఆర్థిక చేయూతనిచ్చిందన్నారు. ఉచిత గ్యాస్, ప్రతి నెల ఒటోవ తేదీన పింఛన్ వంటి పథకాలు పేదలకు అండగా నిలిచాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రతి ఇంట్లో ఏదో ఒక మేలు చేసి ఉన్నాడని చెప్పారు. ఇంటింటికి వెళ్తుంటే ఆయన చేసిన ప్రయోజనాలు చెప్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు. కాగా 22వ డివిజన్ బీవీనగర్, ఎన్‌జీవో కాలనీలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, నాయకులు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేశారు.

వస్త్ర దుకాణం మేనేజర్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మేనేజర్ చేతివాటంపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మినీబైపాస్‌లో మాన్యవర్ దుస్తుల షాపు ఉంది. అక్కడ వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన హజరత్‌రెడ్డి మేనేజర్‌గా, నెల్లూరు వెంగళరావునగర్‌కు చెందిన షంషుద్దీన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 9వ తేదీన షంషుద్దీన్ షోరూమ్ తాళాలు తెరిచారు. క్యాష్ కౌంటర్‌లోని రూ. 1.80 లక్షల నగదు కన్పించలేదు. మేనేజర్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. అతని కోసం గాలించినా ఆచూకి తెలియకపోవడం, నగదు విషయం తేలకపోవడంతో శుక్రవారం షంషుద్దీన్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
● అట్టహాసంగా జయంతి వేడుకలు



సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన డీఆర్వో ఉదయభాస్కర్‌రావు



జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(జడ్పీ), జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు అని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. అల్లూరికి చిన్నతనం నుంచే న్యాయం కోసం పోరాటపటిమను ఎంచుకున్నారన్నారు. ఆదివాసీలకోసం బ్రిటీష్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాడానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **నెల్లూరు(హరనాథపురం) :** కలెక్టరేట్‌లో శుక్రవారం మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వైడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. సీతారామరాజు పోరాటాన్ని, ధైర్యసాహసాలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, ఇతదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు(క్రైం) :** మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు జయంతి సందర్భంగా నగరలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ జి కృష్ణకాంత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అని కొనియాడారు. మన్యం ప్రజల కోసం పోరాడిన ఎంతో మంది ఆహుతయ్యారని, వారందరిని ప్రజలు గుండెల్లో పెట్టుకోవాలన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి



రోశయ్యకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు మాజీ గవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలు శుక్రవారం ఘ నంగా నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ భవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, దాసా లక్ష్మీనారాయణ, ఎంవీ ఆంజనేయులు, జొన్నలగడ్డ మోహన్‌రావులు కేక్ కట్ చేసి రోశయ్యకు ఘన నివాళులర్పించారు. రాష్ట్రానికి, ఆర్యవైశ్యులకు ఆయన అందించిన సేవలను స్మరించుకుని ఆయన ఆశయాలు కొనసాగిస్తామని ప్రకటించారు. ఆర్య వైశ్య వర్తక వాణిజ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రొట్టెల పండుగ ఏర్పాట్లు వేగం పెంచండి

నెల్లూరు(సిటీ), జూలై 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద ఆదివారం నుంచి మొదలయ్యే రొట్టెల పండుగ ఏర్పాట్లలో వేగం పెంచాలని కమిషనర్ నందన్ సూచించారు. దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ, బయోమరుగుదొడ్లు, పార్కింగ్‌ల వద్ద బారికేడ్లు, జోన్ల వారీగా హెల్ప్‌డెస్కులు త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. చెరువు వెంబడి భద్రత చర్యలు పూర్తి చేయాలన్నారు. రొట్టెల పండుగ జరిగే అన్ని రోజులు భక్తులకు వసతులు కల్పించాలన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు రానివ్వకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దర్గా సమీప వాసులు ఆధార్ చూపి వెళ్లాలి

బారాషహీద్ దర్గా వద్ద ఆదివారం నుంచి 10వ తేదీ వరకు రొట్టెల పండుగ జరగనున్న నేపథ్యంలో దర్గాకు సమీపంలో నివాసాలు ఉంటున్న వారు తమ ఆధార్‌కార్డును చూపి కారు, బైకులతో ప్రయాణం చేసుకోవచ్చని రూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనిఖీ అధికారులకు ఎలాంటి పాసులు చూపాల్సిన అవసరం లేదని తెలిపారు. కానీ కచ్చితంగా తమ ఆధార్ మాత్రం చూపాల్సిందేనని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బిస్కెట్, బ్లాక్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై ఎస్ఎల్‌టీ అనే అక్షరాలు, ఎడమ ఛాతిపై ఎస్ అనే అక్షరం పచ్చబొట్టులుగా ఉన్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి న్యూరోకాన్ మేథో సదస్సు ప్రారంభం

నెల్లూరు(వైద్యం), జూలై 4(ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఆసుపత్రిలో రాష్ట్రస్థాయి 32వ న్యూరోకాన్ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాలతో పాలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో న్యూరో వైద్యనిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరోకాన్ కార్య నిర్వాహక కార్యదర్శి నారాయణ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని చెప్పారు. నారాయణ వైద్య కళాశాలలో ఈ సదస్సు నిర్వహించేందుకు సహకరించిన పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అపోలో ఆసుపత్రి వైద్యుడు వెంకట రమణమూర్తి, నెల్లూరు న్యూరోక్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సంపత్‌కుమార్, అధ్యక్షుడు పీఎస్ రెడ్డి, డాక్టర్ సాయికిరణ్, నారాయన ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన బుచ్చిలోని వారాహి నెక్స్ జనరేషన్ పాఠశాలలో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2011-12 మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీలో సాయం త్రం 5 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈనెల 12, 13వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

పరిశ్రమలపై యువతకు అవగాహన ఉండాలి

● మాజీ మేయర్ భానుశ్రీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 4(ఆంధ్రజ్యోతి) : యువత చిన్నతరహా పరిశ్రమల స్థాపనాంశాలపై అవగాహన కలిగి వాటిని స్థాపించాలని మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ అన్నారు. శుక్రవారం నగరంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో చిన్నపరిశ్రమల యూనిట్ల అంశమై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ మంచి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి మాట్లాడుతూ శిక్షణలో చెప్పిన విధంగా యువత తమతమ గ్రామాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ జాబ్స్ జేడీఎం పీ.హైమావతి, సెంచూరియన్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ విశ్వజిత్ సాహు, అరబింద ఉపాధ్యాయ, జి. శేఖర్, సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహా నేతలకు ఘన నివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహా నేతలకు జనసేన నాయకులు శుక్రవారం నగరంలోని 13వ డివిజన్‌లో చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమంలో ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్‌రంగా జయంతిలు, పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆ మహా నాయకులకు నివాళులర్పింఆమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, సుందర్ రామిరెడ్డి, జమీర్, పేనేటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి



ఇంటింటికి కార్యక్రమంలో నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. శుక్రవారం నగరంలోని 16వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి తొలి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెలుతుంటే వారే ఎదురు వచ్చి స్వాగతం పలుకుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. పెన్షన్ పెంచడంపై అవ్వా, తాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చే రూ.4వేల పెన్షన్ ఆసుపత్రి ఖర్చులు, మందులకు వాడుతున్నామని సంతోషంగా చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో చిన్నాబిన్నమైన ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సాయి, మురళి, కేవీ రెడ్డి, హనీఫ్, రాజు, గురుకృష్ణ, క్రాంతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో పతకాలు



పతకాలు సాధించిన భవాని

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి): చెక్ రిపబ్లిక్‌లోని ఒలోమౌక్‌లో జూలై 1 నుంచి 6వ తేదీ వరకు జరుగుతున్న పారా అథ్లెటిక్స్ ఉమెన్ గ్రాండ్ పిక్స్‌లో జిల్లాకు చెందిన వి.భవాని భారతదేశం తరఫున పాల్గొని అసాధారణ విజయాలను సాధించింది. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సొంతం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ కోచ్ ఎస్‌కె.జసీమ్ శిక్షణలో ఆమె ఈ పతకాలు సాధించి దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసిందని డీఎస్‌డీవో యతిరాజ్ తెలిపారు. పతకాలు సాధించిన భవానికి శాప్ ఎండీ గిరీషా, శాప్ చైర్మన్ రవినాయుడు, ఏపీ పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు జీ.కోటేశ్వరరావు, కార్యదర్శి వీ.రామ స్వామిలు అభినందనలు తెలిపారు.

11 నుంచి రెవెన్యూ క్రీడలు

• 3 రోజులపాటు నెల్లూరులో నిర్వహణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగుల కోసం ఈ నెల 11 నుంచి క్రీడా పోటీలు జరగనున్నాయి. జిల్లాలో 10వ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు కలెక్టర్ ఆనంద్ అనుమతి ఇచ్చారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడమేగాక, పరస్పర సన్నిహితతకు, బృందభావనకు, ఉద్యోగుల మధ్య స్నేహభావనకు ఈ క్రీడలు దోహదపడతాయి. 13వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రికెట్, కబడ్డీ, లెమన్ స్పూన్, టగ్‌ఆఫ్ వార్, వాలీబాల్, జావెలెన్ త్రో, చెస్ వంటి పోటీలు జరుగుతాయి.



రెవెన్యూ అధికారులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

• వీపీఆర్ రూ.11 లక్షల సాయం

రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.11 లక్షల ఆర్థిక సాయాన్ని అందచేశారు. అంతేగాక క్రీడా దుస్తులనూ అందచేయడానికి అంగీకరించారు. ఈ ఆర్థిక సహాయ చెక్కును వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో రెవెన్యూ అధికారులకు, ఏపీఆర్ఎస్ఏ నాయకులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను ప్రారంభించిన ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖకు కేటాయించిన ద్విచక్ర వాహనాల్లో డీజీపీ కార్యాలయం నెల్లూరు జిల్లాకు 20 వాహనాలను కేటాయించింది. ఆ వాహనాలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు అందించిన ద్విచక్రవాహనాలు ట్రాఫిక్ నియంత్రనకు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ వాహనాలను నెల్లూరు ట్రాఫిక్, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్ డివిజన్‌లకు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

20న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చెస్ దినోత్సవం, ఫిడే 101వ వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన నగరంలోని ఎంజీబీ మాల్‌లో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వైసుమన్ తెలిపారు. నగరంలోని ఎంజీబీ మాల్‌లో శుక్రవారం చెస్ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్తగా ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. దేశంలోని ప్రతిభావంతులైన చెస్ క్రీడాకారులకు అద్భుతమైన వేదిక కలను ఏర్పాటు చేస్తూ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ చెస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. క్రీడాకారులు పోటీల్లో సత్తా చాటి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీబీ ఎండీ డాక్టర్ గోపాలకృష్ణ, డీజీఎం మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, చెస్ వింగ్స్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీ నాథ్, చెస్ కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్‌వో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా సైన్స్ ప్రదర్శనశాలలో సైన్స్ అధికారి పోస్టుకు డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ సైన్స్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ సర్‌ప్లస్‌గా ఉన్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు వారి దరఖాస్తును ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయానికి ఈనెల 10వ తేదీ లోపు అందచేయాలని తెలిపారు.

నేడు పీసీసీఎఫ్ పర్యటన

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) అజయ్‌కుమార్ నాయక్ రెండు రోజు జిల్లా పర్యటనకు శనివారం రానున్నారు. మొదటి రోజు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. రెండో రోజు ఆదివారం నగర వనంతోపాటు జిల్లాలోని పలు అటవీ ప్లానిటేషన్లను పరిశీలించనున్నారు.

సోమశిలలో 30.620 టీఎంసీల నీరు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 194 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 30.620 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వెయ్యి మందికి సెల్‌ఫోన్లు అప్పగింత

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కోటి రూపాయల విలువ చేసే వెయ్యి సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌హంట్ అప్లికేషన్ సేవలు ప్రజల విశ్వాసాన్ని అందుకుంటూ అమోఘంగా కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 8 విడతల్లో రూ.4 కోట్లు విలువ చేసే 3,900 సెల్‌ఫోన్లను బాధితులకు అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ.6 లక్షల విలువ చేసే 60 ఫోన్లు బాధితులకు అందించామన్నారు. బిల్ లేకుండా, సెకండ్ హ్యాండ్‌లో మొబైల్ ఫోన్లు కొనకూడదన్నారు. ఫోన్ పోయిన వారు తమ మొబైల్ నెంబర్ నుంచి 9154305600కి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపితే గూగుల్ ఫారమ్ లింక్ వస్తుందని, దానిని పూరించి పంపితే మొబైల్ హంట్‌లో కేసు రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. మొబైల్ దొరికిన తర్వాత పోలీసులు బాధితులకు తిరిగి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, సైబర్‌క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

ద్రౌపదీ దేవికి మాన సంరక్షణ అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో జరుగుతున్న ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు 10వ రోజు శుక్రవారం విజయవంతంగా జరిగాయి. రాత్రి మాన సంరక్షణ అలంకారం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి ద్రౌపదీదేవిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం భగవద్గీత పారాయణం, హోమం, చప్పర ఉత్సవం జరిగింది. సాయంత్రం పూలంగిసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.





• నేడు తపస్సుమాను ఉత్సవం

బ్రహ్మోత్సవాల్లో కీలకమైన పెద్దదైన తపస్సుమాను ఉత్సవం శనివారం రాత్రి జరుగుతుందని శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయ ఈవో యు.జానకి తెలిపారు. తపస్సుమాను ఉత్సవం అంటే శివుని మెప్పించి అర్జునుడు పాశుపతాస్త్రం పొందే ఘట్టంను ఈ ఉత్సవంలో ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్వతంపై అర్జునుడు లక్ష్యసాధన కోసం తపస్సు చేసినట్లు తపస్సుమానుపైకి అర్జున వేషధారణలో భక్తులు వెళతారు. అక్కడి నుంచి భక్తులపైకి పండ్లు, చాక్లెట్లు, నిమ్మకాయలు, వంటివి విసురుతారు. వాటిని పట్టుకునేందుకు భక్తులు వేలాది మంది తరలివస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరస్వామి సర్వాభరణాలతో విశేష అలంకారంలో, మంగళవాయిద్యాలతో తపస్సుమాను వద్దకు వస్తారని తెలిపారు. అలాగే ధర్మరాజు స్వామి ఆలయం నుంచి అర్జునుడు విశేష అలంకారంతో వస్తారని, అక్కడ అర్చకులు ఇరువురు మధ్య యుద్ధ సన్నివేశం ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు, పోలీసు భద్రత, సౌకర్యాలు భారీగా చేశామని తెలిపారు.

ఉన్నవి తీసి.. అడ్డదారిలో పోస్టింగ్‌లు!

• ఇంటర్ బోర్డులో అధికారుల కనికట్టు

• నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు



నెల్లూరు(విద్య), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌బోర్డు వివాదాలకు నిలయంగా మారింది. జిల్లాలో అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు అధ్యాపకులకు స్థానం చలనం కలిగింది. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 పోస్టులను, విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోస్టులు తొలగించారు. ఆయా సబ్జెక్టులలో విద్యార్థులు లేని కారణంగా ఈ పోస్టులు తొలగించి విద్యార్థులున్న ప్రాంతాల్లో నియమిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కేఏసీ కళాశాలలో తొలగించిన 2 ప్రభుత్వ తెలుగు అధ్యాపకుల పోస్టుల్లో తిరిగి తెలుగుపోస్టుల్లోనే ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులకు పోస్టింగ్‌లు ఇవ్వడంపై ప్రభుత్వ అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర సబ్జెక్ట్‌లలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా తమకు అనుకూరు కోసం నిబంధనలకు విరుద్ధంగా రెండు పోస్టులు సృష్టించి వారి నియామకాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఓ అధికారి, జిల్లాకు చెందిన మరో అధికారి కలిసి ఈ నియామకాల్లో కీలకంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు వెంటనే విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ పోస్టులు తొలగింపుపై కూడా వారు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

• కెమిస్ట్రీ బోధకులు లేక...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్నింటిలో కెమిస్ట్రీ అధ్యాపకులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అయినవారి కోసం పోస్టులు సృష్టించే అధికారులు, అసలు బోధకులే లేని సబ్జెక్టులకు మాత్రం అధ్యాపకులను ఎందుకు నియమించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేఏసీ కళాశాలలో 170 మందికిపైగా విద్యార్థులకు ఒక కెమిస్ట్రీ లెక్చరర్ ఉన్నారు. ఇక్క మరో అధ్యాపకుడు లేదా గెస్ట్ ఫ్యాకల్టీ అయినా నియమించుకునే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచించలేదు. అలాగే, ఇనమడుగు, కుల్లూరు కళాశాల్లోని అధ్యాపకులు మూడేసి రోజులు చొప్పున కేఏసీ కళాశాలకు వచ్చి కెమెస్ట్రీ బోధిస్తున్నారు. దీనివల్ల ఆయా కళాశాలల్లో వారంలో మూడు రోజులు మాత్రమే కెమిస్ట్రీ బోధన జరుగుతోంది. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, స్వప్రయోజనాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవడం వివాదాస్పదంగా మారుతోంది. రాష్ట్ర ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి ఇంటర్ విద్య మనుగడను కాపాడాలని తల్లిదండ్రులు, ప్రభుత్వ అధ్యాపకులు కోరుతున్నారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా

» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్

» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన

» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం

» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు

» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ

» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు

» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

సంగం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీ సమీపంలోని దళితవాడలో ఉన్న పాఠశాల విద్యార్థులకు రక్షణ యూత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఎంఈవో -2 మల్లయ్య చేతుల మీదుగా శుక్రవారం విద్యాసామగ్రి అందచేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలక, వాటర్ బాటిల్, పెన్సిల్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ యూత్ మినిస్ట్రీస్ నిర్వాహకులు ఉక్కాల నరసింహులు, ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9328
వెండి కిలో ధర	రూ. 110500
వెండి ఒక గ్రాము	రూ. 113.50

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



రవాణాశాఖ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను స్థానిక రవాణాశాఖ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్(ఎంవీఐ) రాములు సిబ్బందితో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వాహనదారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరిగా కన్యకాపరమేశ్వరీదేవి



శాకాంబరి అలంకారంలో అమ్మవారు

ఆత్మకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి



వింజమూరులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



సంగంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం కాకొల్లువారిపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వచ్చేనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో సాధించిన విజయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

●ఉదయగిరి: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్‌రోడ్డులో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●వింజమూరు : మండలంలోని శంకవరం గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడా నరసారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గాలి నరసపనాయుడు, మందాల శ్రీనివాసులనాయుడు, నరసింహారెడ్డి, బయ్యన్న, కొండపల్లి వెంకటేశ్వర్లు, శ్రీను, పెంచలరెడ్డి, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●సంగం : సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మసీదు సెంటర్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, మండల, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కలువాయి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతులు మీదుగా శుక్రవారం పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కలువాయి మండలం రామన్నగారిపల్లెకు చెందిన సన్నపునేని ప్రశాంతికి రూ.1.21 లక్షలు, తోపుగుంటకు చెందిన మోడుబోయిన రమణయ్యకు రూ.51వేలు చెక్కులు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండవనేని హరిబాబు నాయుడు, అరె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



చావిడిలో పీర్లను ప్రతిష్ఠించిన భక్తులు

ఉదయగిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగులబావి వీధి, గుంతబజార్‌లో మొహర్రం ప్రార్థనలను ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా చావిళ్లలో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. గుంతబజార్ పీర్లచావిడిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

●అనంతసాగరం : సాగరంలో శుక్రవారం పీర్లపండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీర్లచావిడి నుంచి పీర్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

డెంగ్యూ నివారణపై విద్యార్థులకు అవగాహన



డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సంగం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ నివారణ మాసోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థులకు డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంటశాల, మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించి దోమల వల్ల వచ్చే డెంగ్యూ వ్యాధి నివారణపై, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అనంతసాగరం జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మానం చేశారు. ఆ పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన టీచర్ గిరిజమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎంగా బాధ్యత స్వీకరించిన వసుంధరాదేవి, గణిత ఉపాధ్యాయుడిగా వచ్చిన కేతా సుబ్బారెడ్డిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెరుకూరి మనోజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, సుధాకర్, గురువయ్యలు బదిలీపై వెళ్లడంతో శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పూజల హరిబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాల్యాద్రి నాయుడు, సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మాల కొండయ్య ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎన్.రవి, పీ. వెంకటేశ్వర్లు, షేక్ రసూల్, ఎస్.రమణయ్యలను ఘనంగా సన్మానించారు.

●ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన జే కృష్ణయ్యను శుక్రవారం గ్రామస్థులు, సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాదవరావు, నాయబ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తా

ఉదయగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చల్లా వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ రసూల్, ఉపాధ్యాయులు బలరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించాలి



లార్వా సర్వేను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

ఉదయగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్యఆరోగ్య సిబ్బంది కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నియంత్రణాధికారి హుస్సేనమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా వెంగళరావు నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. చికున్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది చేపడుతున్న లార్వా సర్వేను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి వినీత, హెచ్‌ఎం హసీనా, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ ఆత్మకూరు శాఖ చైర్మన్ మహ్మద్ సాధిక్ హుస్సేన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చండ్రా వెంకటసుబ్బానాయుడు తెలిపారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు ఎల్‌ఐసీ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువతీ, యువకులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి ఎస్ శ్యామ్‌ప్రభాకర్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, ఎన్జీవో వాగాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి : సీఐ



ఏఎస్‌పేటలో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి

ఏఎస్ పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బరాషాహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగకు విచ్చేసే భక్తులు ఏఎస్‌పేటలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో ఏఎస్ పేటకు భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో శుక్రవారం తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో ప్రసన్నకుమారి, దర్గా ఈవో హుసేన్‌తో కలిసి దర్గాలో ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగా, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై సీఐ వేమారెడ్డి సమీక్షించారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి మేకపాటి చిన్నారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతికి వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారా నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సి గ్రాట్యుటీ తదితర బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు సయ్యద్ ఫకీర్‌షా, జాయింట్ సెక్రటరీ ఏ ప్రతాప్‌రెడ్డి, ట్రెజరర్ కె వెంకటేశ్వర్లు, గ్యారేజ్ సెక్రటరీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సహాయం

ఆత్మకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ సీనియర్ నాయకుడు చదలవాడ హరీష్‌కుమార్ దత్తత తీసుకున్న ఆత్మకూరు మండలం మహిమ లూరుకు చెందిన షేక్ రిజ్వాన కుటుంబానికి వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేయడం హర్షణీయమని ఆర్డీవో బి పావని తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జనసేన నాయకులు రూ. 12వేల నగదును ఆర్డీవో సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం, ఏఎస్‌పేట మండలాల జనసేన నాయకులు దాడి భానుకిరణ్, సయ్యద్ అక్బర్‌బాష పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అడుసుమల్లి వెంకటనారాయణ శుక్రవారం విద్యాసామగ్రిని అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మాలకొండయ్య, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నాదిండ్ల రాజేంద్ర, అడుసుమల్లి రవీంద్రబాబు, గురవయ్య, హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

మహిళపై దాడి : కేసు నమోదు

జలదంకి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన మహిళ మక్కెన రాజేశ్వరిపై అదే గ్రామానికి చెందిన వాకాటి వేణుగోపాల్ దాడిచేసిన సంఘటన గురువారం రాత్రి బీకె అగ్రహారం సమీపంలో జరిగింది. బాధిత మహిళ ఆటోలో ప్రయాణిస్తుండగా బీకె అగ్రహారం సమీపంలోని జువ్విచెట్టుపాలెం వద్ద వేణుగోపాల్ ఆటోను ఆపి రాజేశ్వరిని కిందకు లాగి దాడిచేసి సెల్‌ఫోన్‌ను పగులగొట్టాడు. తాను ఫోను చేస్తే ఎందుకు ఎత్తవు అంటూ ప్రశ్నిస్తూ తనపై దాడి చేశాడని బాధిత మహిళ గురువారం రాత్రి జలదంకి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు శుక్రవారం నిందితుడు వేణుగోపాల్‌పై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

దగదర్తి (బిట్రగుంట) జూలై 4 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి పడి గాయపడి కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై జంపానికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై తెలిపారు. వైద్యం నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు వైద్యుల ద్వారా తెలిసిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

బిట్రగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. చెంచలక్ష్మీపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి ఇద్దరు వ్యక్తులు రెండు ప్లాస్టిక్ క్యాన్లలో 15 లీటర్ల నాటుసారా తీసుకువెళ్తుండగా వెంబడించగా వల్లకి యోహాన్ పరార్ కాగా, అతని భార్య లక్ష్మీప్రసన్నను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద ఉన్న సారాను స్వాధీనపరుచుకున్నామని, కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. ఈ దాడులో నెల్లూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ అనితరెడ్డి, నెల్లూరు, కావలి ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

2 మోటారు బైక్‌ల ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

సంగం (ఆంధ్రజ్యోతి): సంగం - జాతీయ రహదారి కూడలి పీహెచ్‌సీకి ఎదురుగా రెండు మోటారు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. చేజర్ల మండలం మాముడూరు గ్రామానికి చెందిన జయరామయ్య సంగం జాతీయ రహదారి కూడలి నుంచి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటారు బైక్ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొంది. దీంతో జయరామయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందచేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి) : సింగపూర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురుని మోసం చేసిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. డ్రైవర్స్‌కాలనీలో షఫీ అహ్మద్ నివాసం ఉంటున్నారు. ఆయనకు మూడేళ్ల కిందట తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన షేక్ అహ్మద్ మొహిద్దీన్‌తో పరిచయం ఏర్పడింది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆయన షఫీఅహ్మద్, ఆయన కుమారుడు అమ్జాద్, అల్లుడు మీరామొహీద్దీన్‌లను నమ్మించి వారి నుంచి పలు దఫాలుగా రూ.7.50 లక్షల ఫోన్‌పే చేయించుకున్నాడు. వారి వరిజనల్ పాస్‌పోర్టులు, సర్టిఫికెట్లను తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు అహ్మద్ మొహిద్దీన్‌ను ఫోన్‌లో ప్రశ్నించాడు. దీంతో ఇటీవల ఆయన ఫోన్ నెంబరు మార్చేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా : ఇద్దరు మహిళలకు గాయాలు

సైదాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మైనింగ్ పనుల కోసం కూలీలను తరలి స్తున్న ఆటో శుక్రవారం బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. సైదాపురం దళితవాడ నుంచి పది మంది కూలీలను జోగిపల్లి ప్రాంతంలోని మైనింగ్ పనుల కోసం తరలిస్తున్న సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలివెళ్ళారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం, ఆంధ్ర జ్యోతి) : అక్రమంగా గంజాయి ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను జీఆర్‌పీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నిందితుల వివరాలను రైల్వే డీఎస్పీ మురళీధర్ శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గం జాయి అక్రమ రవాణా అరికట్టడం లో భాగంగా నెల్లూరు, గూడూరు, కావలి రైల్వే స్టేషన్‌లలో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టన్నారు. అందులో భాగంగా నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో నాల్గవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌పై ఎస్ఐ జీ మాలకొండయ్య సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా టాటానగర్- ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి దిగిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిష్టు షబ్బర్, మైనర్ బాలుడు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకని కేసు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో రైల్వే సీఐ సుధాకర్, ఎస్ఐ హరిచందన, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

ఉదయగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన పట్టణ శివారు ప్రాంతం గండిపాళెం మార్గంలో శుక్రవారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం పట్టణ శివారు ప్రాంతానికి వచ్చిన దుప్పిపై ఊరకుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో దుప్పి తీవ్రంగా గాయపడి రోడ్డుపక్కన కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా అటుగా వాకింగ్‌కు వెళ్లిన కొందరు గుర్తించి దానిని రక్షించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయాన్ని స్థానికులు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎఫ్‌ఎస్‌వో శ్రీరాములు, ఎఫ్‌బీవో అఫ్జల్ సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించి గండిపాళెం పశు వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి రిజర్వు ఫారెస్టులో దహనం చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 590

సాగునీటి కాలువల అభివృద్ధికి కృషి : ఎస్ఈ

అల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రధాన కాలువలను అభివృద్ధి చేయడంతోపాటు పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్ అన్నారు. అల్లూరు చెరువు ఆయకట్టుకు సాగునీరందించే ఏటిఎస్ ఛానల్ కాలువతోపాటు పలు కాలువలను, మట్టాలను శుక్రవారం సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిఎస్ ఛానల్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయడానికి బదులు కట్టలు బలహీనంగా ఉండడంతో 300 క్యూసెక్కులను మాత్రమే సరఫరా చేయాల్సి వస్తోందన్నారు. పలు షట్టర్లు దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మతులు చేయడంతోపాటు కట్టలను పటిష్టపరచేందుకు నివేదికలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డిఈ పెంచలయ్య, ఏఈ సుధీర్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మేడా కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రేబాల శంకర్‌రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, నీలప రెడ్డి హరీష్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, ఆట తిరుమల, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఆర్ జయంతి వేడుకలు

కావలి,జూలై4(ఆంధ్రజ్యోతి): విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) జయంతి వేడుకలు శుక్రవారం కావలిలో పలు సేవాసంస్థల బాధ్యులు నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ బాధ్యులు డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ రవిప్రకాష్, అలహరి శ్రీనివాస కుమార్, డాక్టర్ కే మాధవరెడ్డి, డాక్టర్ పాముూరు శ్రీధర్, డాక్టర్ టీ రమ్య, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఏ రమేష్‌రెడ్డి, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ నళిని పద్మ పాల్గొన్నారు.

డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో..

డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి పట్టణ జొన్నాయి గుంట, గాయత్రీనగర్, ఇస్లాంపేట అంగన్‌వాడీ సంయుక్త కేంద్రాలలో డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ కూనం తాతిరెడ్డి, జేబీ పీడి ప్రసాద్ రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు ఆటల పోటీల అనంతరం బహుమతులు అందచేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సన్నజీవాల పెంపకందారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పోకూరు పశువైద్యాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని నలదలపూరులో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణా మందును స్థానిక టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన్నం కృష్ణ, మన్నం సుబ్బారావు, నవ్వులూరి కృష్ణయ్య, అత్తోటి సురేష్, నవ్వులూరి అంకయ్య, అత్తోటి రవి, తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల కోసం ఎదురుచూపులు

- మంజూరు కాని నిధులు
- ఎంపిక కాని లబ్ధిదారులు



లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఇంటి నిర్మాణం కోసం వేసిన పునాది

లింగసముద్రం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవైకే-20 ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.గత ఏడాది డిసెంబరులో కేంద్రం ఈ పథకం కింద మండలానికి పక్కా గృహాలు మంజూరు చేసిందని, పక్కా గృహాలు లేకుండా సొంత ఇంటి స్థలం కలవారు కూడా దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు డివిజన్, లింగసముద్రం మండల అధికారులు గ్రామాల ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం కింద ఎస్టీ లబ్ధిదారులకు రూ.3.75 లక్షలు, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.3 లక్షలు, ఓసీ లబ్ధిదారులకు రూ2.50 లక్షలు మంజూరవుతాయని చెప్పారు.దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కా గృహాలు లేని వారు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులను గృహనిర్మాణశాఖ సిబ్బందికి అందజేశారు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు ఈ దరఖాస్తుదారుల్లో 850 మందికిపైగా పొజిషన్ సర్టిఫికెట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఇచ్చినట్టు తెలిసింది.అయితే దరఖాస్తుదారులు చాలా మంది తమకు పక్కా గృహం వచ్చినట్లేనని భావించి, పక్కా గృహ నిర్మాణం కోసం పునాదులు వేసుకున్నారు. అయితే వాస్తవానికి ఈ పథకం కింద కేంద్రం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. దీంతో పక్కా గృహాలకు నిధులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక అధికారులు సతమతమౌతున్నారు. అంతేగాక దరఖాస్తుదా రులకు సమాధానం చెప్పలేక పోతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఇంటూరి జన్మదినం

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు 49వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యా లయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతల సమక్షంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్‌లోని అన్నా క్యాంటీన్ వద్ద కూడా కేక్ కట్ చేసి పేదలకు భోజనం అందజేశారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు, కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. అంకమ్మ అమ్మవారి ఆలయంలో పార్టీ నాయకులు కొడాలి కోటేశ్వర రావు, పిడికిటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పుపాలెంలోని బంగారమ్మ అమ్మవారి ఆలయంలోనూ 17వ వార్డు నాయకులు పూజలు నిర్వహించారు. శారదా నిలయం పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే పార్టీ నాయకులు సోమినేని రవీంద్ర, తలతోటి మస్తాన్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఇంటూరి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బుస్సారెడ్డి కృష్ణా రెడ్డి, గుర్రం మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు ప్రవీణ్ పాల్గొన్నారు.



కందుకూరులో కేక్ కట్ చేస్తున్ననాయకులు



వలేటివారిపాలెం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గుడ్లూరు: ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వద్ద టీడీపీ నాయ కులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉన్నం వెంక టేశ్వర్లు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, చెరుకూరి సూర్యనారాయణ, చిత్తారి మల్లికార్జున పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి జన సేన పార్టీ మండల నాయకులు సనిశెట్టి గిరిబాబు ఆధ్వ ర్యంలో గడియారాన్ని కార్యాలయ సిబ్బందికి శుక్రవారం బహూకరించారు.

వలేటివారిపాలెం: టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం ఇతర టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు గొట్టిపాటి హరికృష్ణ, వలేటి మధు సూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం పాల్గొన్నారు.

ఉలవపాడు: టీడీపీ మం డల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు, చాగొల్లు, కృష్ణాపురం గ్రామాల్లో కేక్ కట్ చేశారు.

లింగసముద్రం: టీడీపీ మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, అంగులూరి చినకొండయ్య, షేక్ నాయబ్‌రసూల్ పొలిమేర చిననాగిరెడ్డి బీ. కొండపనాయుడు, అడపా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

474 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 570 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకురాగా వేలంలో 9 కంపెనీల ప్రతిని. దులు పాల్గొని 474 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-75, ఆర్‌ఆర్-10, సీఆర్-6, జంపింగ్ లాట్స్-5 కారణాలతో 96 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.211.52గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి

కావలి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలం చెంచుగానిపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్ర వారం తనిఖీచేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను గ్రామంలోని రోడ్ల వెంట పోసి వ్యాధులకు కారణం కాకుండా చెత్త సేకరణకు వచ్చే గ్రీన్ అంబాసి డర్లకు అందచేయాలన్నారు. తద్వారా చెత్తతో వచ్చే వర్మీ కంపోస్టు ఎరువును రాయితీతో రైతులకు అందించి పంచాయతీలకు సంపద సృష్టించటం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయమ్మ స్థానిక టీడీపీ నాయకుడు నాశిన జాలరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు పోసిన శ్రీనివాసులు, తాతా హరిబాబు, బండ్ల రవీంద్ర, బండ్ల రాఘవులు, పోసిన వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్‌రంగా జయంతి

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు శుక్రవారం కావలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఉన్న రంగా విగ్రహానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డితోపాటు కాపునేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, రంగా విగ్రహకమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు, కాపునేతలు ఆలా శ్రీనివాసులు, మాల్యాద్రి పాల్గొన్నారు.

'కార్పొరేట్' కోసం భూములు లాక్కోవడం దారుణం

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉలవ పాడు మండలంలోని కరేడు, గుడ్లూరు మం డలంలోని పలు గ్రామాల్లోనూ ఇండోసోల్ కంపెనీ కోసం పంటలు పండే భూములను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం దారుణమని నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, అభివృద్ధి మండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. స్పెషల్ పార్టీ పోలీసులను పంపించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి రైతుల భూములను లాక్కోవాలని జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రతిఘటించి తీరుతామన్నారు.

యువ ఇంజనీర్లు నూతన సాంకేతికత అలవర్చుకోవాలి

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

కావలి (టౌన్), జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేటితరం యువ ఇంజనీర్లు నూతన సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని జెఎన్‌టీయూ (అనంతపురం) ఉపకులపతి (వీసీ) ప్రొఫెసర్ హెచ్ సుదర్శనరావు పేర్కొన్నారు. కావలిలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి స్నాతకోత్సవం శుక్రవారం కేవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆ సంస్థ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ నూతన ఆలోచలతో కొత్త ఒరవడికి నాంది పలకాలని, అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చైర్మన్ విద్యాధర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల స్వయం ప్రతిపత్తి హోదా సాధించిన కొద్ది కాలానికే విద్యార్థులూ జేఎన్‌టీయూ పరిధిలో ఉన్నత ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, జేఎన్‌టీయూ ప్రతినిధి డాక్టర్ మాధవి, ఎస్వీయూ ప్రతినిధి డాక్టర్ మురళీ, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, ఇన్‌చార్జ్ లిఖిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న వీసీ సుదర్శనరావు తదితరులు

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే దగుమాటి పరామర్శ

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో మృతిచెందిన, అనారోగ్యంతో ఉన్న పలు కుటుంబాలను శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాతృమూర్తి అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో కావలిలోని వారి నివాసానికి వెళ్లి ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించి సుకుమార్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం వస్త్రవ్యాపారి వేమూరి పెద్దులు సతీమణి ప్రమీలమ్మ ఇటీవల మృతిచెందడంతో స్థానిక బృందావనం కాలనీలోని ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే టీడీపీ కార్యకర్త గంగిరెడ్డి ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మద్దూరుపాడులోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పమిడి రవికుమార్‌చౌదరి, పోతుగంటి అలేఖ్య, తటవర్తి రమేష్, శ్రీరాం మాల్యాద్రి తదితరులు ఉన్నారు.



అన్నపూర్ణమ్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేతలే వారి ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించి సుపరిపాలన అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి పట్టణం 8వ వార్డులోని చింతంవారి వీధిలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇప్పటివరకు అర్హులకు ఏఏ పథకాలు అందాయో తెలుసుకుని త్వరలో అందించబోయే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, మొగిలి కల్లయ్య, అమరా వేదగిరి క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు కో కన్వీనర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతంవారి వీధిలో సీసీ రోడ్డు, డ్రైన్లు నిర్మాణాలకు రూ.22 లక్షలు మంజూరుచేసి ఆ పనులకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్‌తో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు.

బోగోలులో ...

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేల్లపల్లి సుధీర్‌బాబు విశ్వనాథరావుపేటలో, బిట్రగుంట పంచాయతీలో ఆర్ విజయ్‌కుమార్, కే బసిరెడ్డి, వాకా మహేష్‌రెడ్డి, తాళ్ళూరులో యూనిట్ ఇన్‌చార్జి పులి మహేష్, సుబ్బారావు, శ్రీనివాసులు తదితరులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కే వెంకటేశ్వరరెడ్డి, పీ శ్రీధర్, టీ ప్రసాద్, షేక్ రఫీ, నరసింహారావు, బీ ప్రభాకర్‌రెడ్డి, ఏ ప్రసాద్, అఖిల్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కలిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని క్రాకుటూరు గ్రామానికి చెందిన మన్నేటి దేవమ్మకు వింజమూరు సమీపంలోని బొమ్మరాజుచెరువు గ్రామం వద్ద క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ 6లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు జరిమానాలు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేకపోయినా, పత్రాలు సరిగ్గా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీఎన్ లక్ష్మీ హెచ్చరించారు. పట్టణంలోని స్కూల్ బస్సులపై శుక్రవారం ఎంవీఐ జే. అనిల్‌కుమార్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీ చేశారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం మండలంలోని సాయిపేట, కొమ్మి, కొండాపురం కాంప్లెక్స్‌లలో జరిగింది. ఈ సందర్భంగా ఆశాఖ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు గాలంకి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఐఆర్‌ను వెంటనే ప్రకటించి పాత, కొత్త డీఏలను ప్రకటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆశాఖ మండల ప్రధాన కార్యదర్శి బి మధు, పదర్ల శ్రీనివాసులు, కోశాధికారి డి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



కొండాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన పూర్వ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మాల్యాద్రి, రామక్రిష్ణ, జ్యోతిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మ నేత్రదానం



మన్నెమాల అన్నపూర్ణమ్మ (ఫైల్)

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాతృమూర్తి మన్నెమాల అన్నపూర్ణమ్మ గురువారం రాత్రి మృతిచెందగా మరణానంతరం నేత్రదానం చేశారు. ఆమె మరణించిన వెంటనే తనయుడు సుకుమార్ రెడ్డి రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం ఇచ్చి తమ తల్లి కార్నియాలను సేకరించాలని కోరారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ టెక్నిషియన్ సునీల్ తమ సిబ్బందితో శుక్రవారం కావలికి వచ్చి కార్నియాలను సేకరించారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, అభయం సేవా సంస్థ నిర్వాహకురాలు ఇలింద్ర శ్రీవాణి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి నేత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా తల్లి నేత్రాలను దానం చేసిన సుకుమార్ రెడ్డికి రెడ్‌క్రాస్, అభయం బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో అల్లూరి జయంతి

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, మాల్యాద్రినాయుడు, ముచ్చల భూషయ్య, ఉన్నం భాస్కరరావు, తానికొండ కోటయ్య, నాగినేని ప్రసాద్, డాక్టరు తిరుమలరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామయ్యకు దగ్గుబాటి పురంధరేశ్వరి నివాళులు

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ఎంపీ, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి శుక్రవారం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్యకు నివాళులర్పించారు. రామయ్య సతీమణి కంచర్ల ధనలక్ష్మి, కుమారులైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విజయ్ శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దగ్గుబాటి కుటుంబంతో రామయ్యకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.



కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి

ఐచ్ఛిక సెలవులపై నియంత్రణ సరికాదు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సర క్యాలెండర్‌లో ప్రకటించిన ఐచ్ఛిక సెలవులను వాడుకోవటంలో ప్రభుత్వ నియంత్రణ సరికాదని, ఈసెలవులను పూర్తిగా వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతించాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విధించిన నియంత్రణలతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఆయన ప్రకటనలో తెలిపారు.

ఇదీ.. బడి బస్సు



ఆ బస్సు వెనక.. పక్కన అద్దాలు పగిలాయి. వెనకైతే అద్దమే లేదు. కానీ పట్ట కట్టారు. బస్సులోపల ఎవరైనా పట్ట మీద పడితే కింద పడాల్సిందే. ఇంతటి ప్రమాదకరస్థితిలో ఉన్న ఈ బస్సు.. కేవీబీపురం మండలం నుంచి ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుతుంది. ఈ బస్సులో భద్రత ఏమాత్రమంటూ పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

పొట్టేలు తోక బారెడు





గొర్రె తోక బెత్తెడు అంటారు. కానీ.. ఇక్కడ పొట్టేలు తోక బారెడుంది. సాధారణంగా పొట్టేలుకు నాలుగు లేదా ఐదు అంగుళాల తోక ఉంటుంది. ఈ ఫొటోలోని పొట్టేళ్లకు మాత్రం దాదాపు 15 అంగుళాల తోక ఉంది. వీటిని దక్కనీ గొర్రెలు జాతులుగా పిలుస్తారని తెలిసింది. మహారాష్ట్రలో ఎక్కువగా సంతానోత్పత్తి జరిగే ఈ తరహా పొట్టేళ్లను తిరుపతికి కొందరు తీసుకొచ్చారు. అర్బన్ తహసీల్దారు కార్యాలయం ముందు మేస్తున్న ఈ పొట్టేళ్లను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఆ ఏడుగురు సీఐలపై డీఐజీకి నివేదిక

● త్వరలో ఐదారుగురి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): వీఆర్, అటాచ్‌మెంటులోని ఏడుగురు సీఐలపై డీఐజీకి జిల్లా పోలీసు యంత్రాంగం నివేదిక పంపింది. ఆ సీఐల పనితీరు.. అటాచ్‌మెంటులో ఉన్నవారు ఎలా పనిచేస్తున్నారు? వీఆర్‌కి రావడానికి కారణాలు ఏమిటి అనే సమగ్ర వివరాలతో ఈ నివేదిక పంపారు. దీనిని అనుసరించి కొంతమంది సీఐలకు పోస్టింగులిచ్చే అవకాశముంది. త్వరలో అనంతపురం రేంజ్ పరిధిలో సీఐల బదిలీలు జరగనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది సీఐలకు స్థానచలనం కలగనుంది. ఐదారు మంది సీఐలు బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డిని తిరుపతి ట్రాఫిక్‌కు మార్చారు.

తులాభారంలో అక్రమాలు నిజమేనా!

● విచారణలో నిమగ్నమైన టీటీడీ విజిలెన్స్



తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి ఆలయంలోని తులాభారంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై టీటీడీ విజిలెన్స్ అధికారులు విచారణలో నిమగ్నమయ్యారు. అక్రమాలు జరిగాయా.. ఏ స్థాయిలో జరిగాయి.. అందులో ఎంత మంది ఉన్నారు.. తులాభారం ఆరోపణల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది ప్రమేయముందా.. అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తమ పిల్లల బరువుకు తగినట్టు బియ్యం, బెల్లం, పంచదార, కలకండ, నాణేల వంటి వాటితో తులాభారం వేసి స్వామికి మొక్కులు చెల్లించడమనేది పురాతన సంప్రదాయం. నేటికీ తులాభారం వేసే భక్తుల సంఖ్య అధికంగానే ఉంటోంది. పూర్వం భక్తులే తాము ముడుపు కట్టిన ఈ వస్తువులను మోసుకొచ్చి తులాభారం మొక్కులు చెల్లించేవారు. ఆ తర్వాత భక్తులకు సులభతరంగా ఉండాలనే ఉద్దేశ్యంతో టీటీడీ.. భక్తులు కోరుకున్న వస్తువులతో తులాభారం వేసి వాటికి సరిపడా నగదు తీసుకుంటోంది. ఈ తులాభారం వ్యవహారాన్ని పగటి వేళ ఒక బ్యాంకు.. రాత్రి మరో బ్యాంకు నిర్వహిస్తోంది. ప్రస్తుతం రోజుకు రూ.10 లక్షల నుంచి 12 లక్షల వరకు నగదు అందుతోంది.

చేతివాటం చూపిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది?

'వైసీపీ ప్రభుత్వంలో భక్తులు ముడుపులు కట్టిన డబ్బునూ వాటాలేసుకున్నారు. తులాభారం ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకుల ద్వారా స్వామి ఖజానాకు వెళ్లాల్సిందిపోయి కొంతమంది చేతులు మారడం దురదృష్టకరం' అంటూ రెండునెలల కిందట టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఇప్పుడు విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. గత ప్రభుత్వంలో తులాభారంలో అక్రమాలకు పాల్పడిన కొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించారే తప్ప కేసులు పెట్టలేదని గుర్తించారు. దీంతో ఆ సమయంలో ఎవరు విధులు నిర్వహించారు? తులాభారం ద్వారా వచ్చిన సొమ్ములు ఎలా బ్యాంకులకు తరలించేవారు? నగదు ఎలా అపహరించి బ్యాంకుల్లో మేనేజ్ చేశారు? వీరికి టీటీడీ అధికారులు లేదా సిబ్బంది సహకారం ఏమైనా ఉందా? మొత్తం ఎంత సొమ్ము పక్కదారి పట్టి ఉండొచ్చనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తులాభారంలో అక్రమాలకు పాల్పడి విధుల నుంచి తొలగించిన ఓ వ్యక్తికి దాదాపు రూ.10 కోట్ల ఆస్తి ఉండటాన్ని చూసి అధికారులు షాక్‌కు గురవుతున్నట్టు తెలిసింది. కేవలం రూ.14 వేల జీతం కలిగిన ఆ ఉద్యోగి ఇంతస్థాయిలో ఎలా ఆస్తులు కూడబెట్టాడనే అంశంపైనా దర్యాప్తు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, కొందరు ఉద్యోగులు ఈ విచారణకు సహకరించడం లేదని తెలిసింది. అయినప్పటికీ ఇందులోని అక్రమాలను పూర్తిస్థాయిలో వెలుపలకు తీసేలా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతులకు రాబడి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), జూలై4(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సంపాదించడానికి రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆ సొసైటీల రాష్ట్ర కార్యదర్శి బాలాజీ చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించరు. తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, రైతు సాధికార సంస్థ, వారాహి ఫౌండేషన్ సంయుక్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులు తమ పంటలను వస్తువుల రూపంలోకి మార్చి మార్కెటింగ్ చేయడమే ప్రాసెసింగ్ విధానం. రైతులు సొసైటీలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35 శాతం, బ్యాంకులు 55శాతం ఆర్థిక సహకారం అందిస్తే, రైతు 10శాతం వాటా భరించాలి. దీనివల్ల దళారీ వ్యవస్థ ఉండదు. సొసైటీ సభ్యులు ఐక్యమత్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ చేసుకొంటే లాభాలు అవే వస్తాయి. మార్కెటింగ్‌లో ప్రభుత్వం కూడా సహకరిస్తుంది. రాయలసీమలో పండించే మామిడి, టమోట, వివిధ రకాల పండ్లకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే లాభాలు వస్తాయి. సేంద్రియ సాగు చేస్తే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు' అని వారు వివరించారు. తాను, తన భార్య ఉద్యోగాలు వదలి సేంద్రియ వ్యవసాయం చేస్తూ వాట్సాప్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నామని సత్యనారాయణ చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకుని మంచి ఫలితాలు ఆర్జిస్తున్నామని జయప్ప నాయుడు చెప్పారు. కొన్ని ప్రాసెసింగ్ యూనిట్ల వారు తమ ఉత్పత్తులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సతీష్, శోభన్‌బాబు, దశరథరామిరెడ్డి, ప్రభాకర్, హరికుమార్‌రెడ్డి, రవికుమార్, డాక్టర్ గంగాధర్, దశరథాచారి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బూతుల దండకం

● మహిళా భద్రతా సిబ్బందిపై దౌర్జన్యం

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్ర.. ధర్మరాజుల గుడి వద్ద శుక్రవారం సాయంత్రం బూతుల దండకంతో రెచ్చిపోయాడు. దీనిపై ఈవోకు ఫిర్యాదు చేసేందుకు భద్రతా సిబ్బంది సంతకాలు సేకరించారు. తొలి నుంచీ ఇతడిపై తీవ్ర ఆరోపణలున్నాయి. గతంలో ఆలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి రెడ్‌హ్యాండెడ్‌గా చంద్ర పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదై జైలుకూ వెళ్లాడు. వైసీపీ హయాంలో డిప్యూటీ ఈవోగా ఉన్న కృష్ణారెడ్డి.. ఇతడిని తిరిగి సెక్యూరిటీ గార్డుగా నియమించి తనకు వ్యక్తిగత సహాయకుడిగా నాలుగేళ్ల పాటు ఉపయోగించుకున్నారు. హుండీ దొంగను తిరిగి సెక్యూరిటీ గార్డుగా నియమించారనే విమర్శలతో పక్కన పెట్టారు. గతేడాది ఎన్నికలకు ఆరునెలల ముందు దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులతో తిరిగి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చంద్ర చేరాడు. నర్సింగ్ కళాశాలలో వ్యాన్ డ్రైవర్‌కు సహాయకుడిగా పని చేయాల్సిన ఇతడు.. నిత్యం ముక్కంటి ఆలయంలోనే ఉండేవాడు. భక్తుల నుంచి నగదు వసూలు చేసి దర్శనాలకు తీసుకెళ్తుండడంతో కొందరు సిబ్బంది ఇటీవల నిలదీసినా.. పట్టించుకోలేదు. శుక్రవారం సాయంత్రం ధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో అర్జున వేషధారి తాటిచెట్టుపై నుంచి నిమ్మకాయలు విసిరే సమయంలో వందలాది మంది భక్తులు చుట్టుముట్టారు. వారిని కట్టడి చేసేందుకు ఆలయభద్రతా సిబ్బంది అర్జున ప్రాధారిని ఆలయంలోపల గదిలోకి రక్షణ వలయంగా ఏర్పడి తీసుకెళ్లారు. ఈ సమయంలో తనను అర్జున వేషధారి వద్దకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారన్న ఆగ్రహంతో చంద్ర బూతుల దండకంతో ఆలయ ప్రాంగణంలోనే రెచ్చిపోయాడు. మహిళా భద్రతా సిబ్బందిని తోస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డాడంటూ 18 మంది మహిళా సెక్యూరిటీ గార్డులు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు సంతకాలు సేకరించారు. రాత్రి అయిపోవడంతో మరికొందరి సంతకాలతో కలిపి ఈవో, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు.

చేతిపై గోవిందుడి చిత్రం



టాటూ అనగానే చిత్రవిచిత్రమైన బొమ్మలు దర్శనమిస్తాయి. శ్రీవారి భక్తురాలైన బెంగళూరుకు చెందిన సౌజన్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాత్రం తన కుడిచేతిపై శ్రీవారి చిత్రంతో పాటు శంఖుచక్రాలు, పాదాల నడుమ ఎర్రటి నామం ఉండేలా టాటూ వేయించుకున్నారు. శుక్రవారం శ్రీవారి దర్శనానికి వచ్చిన సౌజన్య చేతిపై ఉన్న ఈ టాటూను పలువురు భక్తులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



క్రిస్ సిటీ పనుల్లో వేగం పెంచండి

● ఇండస్ట్రియల్ ప్రధాన కార్యదర్శి యువరాజ్ సూచన

కోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోట, చిల్లకూరు మండల్లో జరుగుతున్న క్రిస్ సిటీ పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం చూపొద్దని రాష్ట్ర పరిశ్రమల ముఖ్య కార్యదర్శి యువరాజ్ అన్నారు. కోట మండలం కొత్తపట్నం, వావిళ్లదొరువు గ్రామాల్లో పరిశ్రమలకు కేటాయించిన భూములను శుక్రవారం జేసీ శుభంబన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనతో కలిసి ఆయన పరిశీలించారు. 'క్రిస్‌సిటీలో తాగునీటి పైపులైన్లు, విద్యుత్ అలంకరణ, డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయాలన్నారు. భవిష్యత్తులో మరికొన్ని పరిశ్రమలు కొత్తపట్నంకు రానున్నాయని.. వాటికి భూములు అవసరమైనప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతుల వద్ద భూములు తీసుకునేటప్పుడు గ్రామాల్లోని ఇళ్లను మినహాయించాలి' అని యువరాజ్ సూచించారు. వావిళ్లదొరువులోని కృష్ణపట్నం లేదర్‌కాం ప్లెక్స్ భూములనూ ఆయన పరిశీలించారు. ఏపీఐఐసీ జీఎం చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు తదితరులు ఉన్నారు.

నౌకా నిర్మాణ నమూనా పరిశీలన


వాకాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో నిర్మించనున్న నౌకానిర్మాణ డిజిటల్ నమూనాను ఇండస్ట్రియల్ ప్రధాన కార్యదర్శి యువరాజ్ శుక్రవారం జేసీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనతో కలసి పరిశీలించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ వారు తయారుచేసిన నమూనా గురించి తహసీల్దారు రామయ్య, మండల సర్వేయర్ శకుంతల వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నౌకా నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నమూనాను పరిశీలిస్తున్న యువరాజ్ తదితరులు

కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు

● ఈఎస్ఐ ఆస్పత్రిని తనిఖీ చేసిన డైరెక్టర్ ఆంజనేయులు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఆంజనేయులు

తిరుపతి(వైద్యం), జూలై 4(ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆరోగ్య భద్రత దిశగా ఈఎస్ఐ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఈఎస్ఐ రాష్ట్ర బీమా వైద్య శాఖ డైరెక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిలోని పలు వార్డులను, ఓటీ కేంద్రాలను, ఫార్మసీ, ల్యాబ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. అవసరమైన సర్జికల్స్, ల్యాబ్ పరికరాలను సమకూర్చేందుకు రూ.11 కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, జీతాలు పెంచాలని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ శ్యాంబాబు, ఆర్ఎంవో ఏవీఎస్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

తిరుపతి(నేరవిభాగం), జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో మొహర్రం పండుగ జరుపుకొనే సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు శుక్రవారం హెచ్చరించారు. రోడ్లపైన బైక్ ర్యాలీలు, మితిమీరిన శబ్ధంతో డీజే బాక్సులు నిషేధించామన్నారు. డీజే బాక్సులు ఉపయోగించాలంటే పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు.


భక్తుల పైకి నిమ్మకాయలు విసురుతున్న అర్జున వేషధారి

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించి శుక్రవారం నాటికి సంవత్సరం పూర్తి కావడంతో కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, సుధారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అభివృద్ధిలో అందరి సహకారం ఉందని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని కలెక్టర్ వారికి సూచించారు.


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు



సర్వే సత్యనారాయణ- చమక్ చంద్ర

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, సినీ హాస్య నటుడు చమక్ చంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.


సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,015

తలనీలాలు సమర్పించినవారు: 26,786





అర్జున తపస్సు

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు. అర్జున పాత్రధారి మంత్రించి తపాస్మన్ నుంచి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ నిమ్మకాయల వల్ల శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. కాగా, దీని కోసం ఏడు బస్తాల నిమ్మకాయలను సిద్ధం చేయగా అర్జున వేషధారి తాటిచెట్టుపైకి చేరుకునేటప్పటికి నాలుగు బస్తాలే పైకి పంపారు. మిగిలిన మూడింటిని కొందరు ఉద్యోగులు మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అనుమానంతో తల్లీకొడుకుల దాడి

అవమానంతో మహిళ ఆత్మహత్య

- మృతదేహంతో బంధువుల ధర్నా

పెళ్లకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తన భర్తకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కుమారుడితో కలిసి ఆమె.. ఆ మహిళపై దాడి చేసింది. ఆ అవమానం భరించలేక బాధితురాలి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం పునబాక గిరిజన కాలనీలో అమాస సాయి, దుర్గ (22) దంపతులు ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ సాయి ఇంట్లోనే ఉండగా, దుర్గ కూలి పనులు చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుర్గపై అదే గ్రామానికి చెందిన నీలం వెంకటసుబ్బయ్యగౌడ్ భార్య మస్తానమ్మ, ఆమె కుమారుడు అబ్దుల్ దాడికి పాల్పడ్డారు. దీనిని అవమానంగా భావించిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దుర్గ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరిగే సమయంలో ఈ దాడి విషయం తెలిసింది. వెంటనే బంధువులు ఆగ్రహంతో పెళ్లకూరుకు చేరుకుని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉంచి ధర్నా చేపట్టారు. దుర్గపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మీ, అజయ్‌కుమర్, స్వప్న, సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప జేశారు. అదే మృతదేహంతో పోలీసస్టేషన్ ఎదుట బాధితులు మళ్లీ ధర్నా చేశారు. తమకు మద్దతుగా వచ్చిన దళితనేత యాగాన్ని బెన్నీపై దాడికి పాల్పడిన వెంకటసుబ్బయ్య గౌడ్ బంధువులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు ధర్నా విరమింప చేసేదిలేదన్నారు. నిందితులను అరెస్టుచేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకుని తమ కాలనీకి వెళ్లారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీస్ స్టేషన్‌లోకి చొరబడుతున్న వారిని అదుపు చేస్తున్న పోలీసులు

తిరుపతిలో కిలేడి

- ఆస్తికోసం భర్త, బిడ్డను వదిలేసి రెండో పెళ్లికి సిద్ధం
- తనపై దాడి చేస్తోందంటూ పెళ్లికుమారుడి తల్లి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'భర్త, బిడ్డను కాదనుకుంది. డబ్బు కోసం రెండో పెళ్లికి సిద్ధమైంది. ఈ పెళ్లికి ఒప్పుకోని తనను వేధింపులకు గురిచేసి.. హత్యకు యత్నిస్తోందని పెళ్లికుమారుడి తల్లి, ఎస్టీవి కాలనీకి చెందిన నాగరత్న భాగవతారిణి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఆమె మీడియాతోనూ మాట్లాడారు. 'తిరుపతి నగరం భవానీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న మహిళకు భర్త, కుమార్తె ఉన్నారు. నా కుమారుడు ఆర్.గోపినాథ్‌కు మాయమాటలు చెప్పి పెళ్లికి ఒప్పించింది. నేను సంపాదించిన ఇళ్లు, ప్లాట్లు, ఇతర ఆస్తులను దౌర్జన్యంగా తీసుకోవడానికి ఆమె నా కొడుకును పెళ్లి చేసుకుంటోంది. నేను ఒప్పుకోకపోవడంతో నా కుమారుడిని రెచ్చగొట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. నా కుమారుడితో కలిసి నన్ను హతమార్చడానికి పథకం వేసింది. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి పెళ్లి పత్రికలు కొట్టించి నా ఇంటికొచ్చారు. గురువారం రాత్రి కూడా నాపై దాడికి దిగారు. దీంతో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి వారిద్దరిపై ఫిర్యాదు చేశా'నని ఆమె పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారించి, వారిద్దరి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.


మీడియాతో మాట్లాడుతున్న నాగరత్న

గంజాయి మత్తులో వేధింపులు

- బాలిక బలవన్మరణం.. ముగ్గురిపై కేసు

తిరుచానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలికను ప్రేమపేరుతో గంజాయి మత్తులో ఓ యువకుడు వేధించాడు. అతడి కుటుంబీకులూ సహకరించారు. దీంతో ఆ బాలిక బలవన్మరణం చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో చిన్నబ్బ, రోజా దంపతులు ఉంటున్నారు. ఏడాది కిందట రోజా మృతిచెందింది. వీరి కుమార్తె గీతాంజలి(15) జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ఐదు నెలల కిందట జులాయిగా తిరిగే నవీన్‌తో ఈమెకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలిసి చిన్నబ్బ కుమార్తెను మందలించి మరో అద్దె ఇంట్లోకి మారాడు. అయినా నవీన్ ఫోన్ చేసి గంజాయి మత్తులో ఆమెను బెదిరించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నవీన్, అతడి తల్లి సుశీల, సోదరి కన్నెమ్మ బాలిక ఇంటికి వచ్చి దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుంది. బాలిక నానమ్మ ఆదిలక్ష్మి గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు గడియ పగులగొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న గీతాంజలిని రుయాస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె గీతాంజలిని ఆత్మహతకు ప్రేరేపించి వేధించిన నవీన్, అతడి కుటుంబీకులపై చర్యలు తీసుకోవాలని చిన్నబ్బ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాధ్‌చౌదరి తెలిపారు. నవీన్ నిత్యం గంజాయి తీసుకుని జులాయి తిరిగేవాడని ఎస్‌ఐ తెలిపారు. గీతాంజలి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అమ్మ ఒడి.. ఈ సర్కారు బడి!

నాడు 71 మంది.. నేడు 107 మంది పిల్లలు



కొత్తగా చేరిన పిల్లలతో ఉపాధ్యాయులు

చదువే లక్ష్యం, జ్ఞానం.. చదువే ధైర్యం.. గమ్యం!... అంటూ గురువులు చేసిన హితబోధ ఆ సర్కారు బడికి విద్యార్థులు 'క్యూ' కట్టేలా చేసింది. సెలవుల్లో ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, ఏడాదికేడాదికీ పెరుగుతున్న ఉత్తీర్ణత శాతంపై ఉపాధ్యాయులు ఇచ్చిన భరోసా తల్లిదండ్రులఆలోచనల్లో మార్పు తీసుకొచ్చింది. ప్రైవేటు బడుల్లో ఫీజుల దెబ్బకు అల్లాడిపోతున్న తల్లిదండ్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానాలు, సరికొత్త సంస్కరణలు కొండంత ధైర్యం నింపుతున్నాయి. మనుబోలు మండలంలోని ఆరు ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడమే ఇందుకు నిదర్శనం. ఈ ఆరింటిలోనూ ఈ విద్యా సంవత్సరంలో పెరిగిన విద్యార్థుల శాతంతో మనుబోలు సీఎంనగర్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో ఈ పాఠశాలలో 71 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 107 మంది చదువుతున్నారు. ఒకప్పుడు విద్యార్థులు లేక వెలవెలబోయిన ఈ సర్కారు బడి.. నేడు నిండుగా కళకళలాడుతోంది. హెచ్ఎం రాణి ఆధ్వర్యంలో నలుగురు ఉపాధ్యాయులు పిల్లల నమోదు ప్రక్రియలో శ్రద్ధ వహించడంతో ఈ మోడల్ స్కూల్ మండలంలో టాప్‌లో నిలిచింది.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

గురుకుల్లాలో ఔట్‌సోర్సింగ్ టీచర్లకు

గౌరవ వేతనం పెంపు

నెల్లూరు (హరనాథపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 12 గిరిజన సంక్షేమ గురుకులు ఉండగా, 2,944 విద్యార్థులు చదువుతున్నారు. 79 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉండగా, ఒక్కొక్కరికి రూ.14,800 గౌరవ వేతం అందుతోంది. ఈ వేతనం రూ.19,350 లకు పెరిగింది. ఆ విద్యాలయాల్లోనే పోస్టు గ్రాడ్యుయేట్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ముగ్గురు పని చేస్తున్నారు. వీరికి ప్రస్తుతం రూ. 16,100 వేతనం ఉండగా, 24,150లకు పెరిగింది. నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో నెల్లూరు, చిత్తూరు, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాలు ఉండగా, 45 గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 9,708 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గ్రాడ్యుయేట్ టీచర్లు 268, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు 25మంది, జూనియర్ లెక్చరర్లు 11 మంది పని చేస్తున్నారు. కాగా, జూనియర్ లెక్చరర్లు జిల్లాలో లేకపోయినా తిరుపతి జిల్లాలో ఉన్నారు. వీరికి గౌరవవేతనం రూ.18వేల నుంచి 24,150లకు పెరిగింది. ఐటీడీఏ పీడీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, అందుకు తగ్గట్టు ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయయులకు గౌరవవేతనం పెంచడం అందరిలో ఆనందం నింపినట్లు అయ్యిందని అన్నారు.



ఇక టీచర్ల హాజరుపై గురి

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బడుల్లో ఉండాల్సిందే!
- యాప్‌లో నమోదు తప్పనిసరి
- పక్కాగా పాఠశాలల మార్గదర్శకాలు అమలు

పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై గురిపెట్టాలి. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే యాప్‌లో హాజరు నమోదు చేయాలి. 9.30 గంటలకు హాజరు నివేదిక తనకు సమర్పించాలి. బోగస్ హాజరు నమోదు కాకుండా డీఈఓతోపాటు డిప్యూటీఈఓలు, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశాలు నిర్వహించి హాజరుపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి. జూలై 10 తరువాత నా తనిఖీల్లో బోగస్ హాజరు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు.

- విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షలో పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు

ఉపాధ్యాయుల సమయ పాలనపై విద్యా శాఖ దృష్టి సారించింది. విద్యార్థులకు కిట్ల పంపిణీ, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జూలై 1వ తేదీ నుంచి పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ రూపొందించే మార్గదర్శకాలను అమలు చేయనున్నారు. త్వరలోనే టీచర్లకు ఫండమెంటల్ లెర్నింగ్ పేరుతో శిక్షణ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లంతా ఉదయం 9 గంటలకే పాఠశాలలకు హాజరు కావాలని, సాయంత్రం 4 గంటల వరకు ఖచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు, విద్యార్థి హాజరు పూర్తి చేయాలి. ప్రక్రియ పూర్తి చేయకపోతే వెంటనే ఎంఈఓ నుంచి సమాచారం తెప్పించుకోవాలి. పాఠశాలల్లో సమావేశాలు సాయంత్రం 4 గంటల తరువాతనే నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.


యాప్‌లో అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- జీతాలకు లైన్ క్లియర్

జిల్లాలో జరిగిన ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు, పాఠశాలలకు బదిలీ అయిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల జీతాలు చెల్లించేందుకు లైన్ క్లియర్ అయినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల కొత్త కేడర్ స్ట్రెంగ్త్ డీఈఓ కార్యాలయం ఐటీసెల్‌కు వచ్చింది. ఆన్‌లైన్‌లో ఏ టీచర్ పాఠశాల నుంచి ఏ పాఠశాలకు బదిలీ అయిన వివరాలు, టీచర్ల ట్రెజరీ ఐడీ నెంబర్ కూడా ఉండడంతో నిర్ధారణ తేలికగా పూర్తి చేశారన్నారు. కొత్త కేడర్ వివరాలను ధ్రువీకరించి పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం నుంచి ట్రెజరీ కార్యాలయానికి పంపించామన్నారు. ఈ వివరాలు డీటీఏ నుంచి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరుతున్నాయని, వెంటనే జీతాల బిల్లుల మంజూరుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పునర్వవస్థీకరణలో భాగంగా యూపీ స్కూల్స్ నుంచి అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లోని హెచ్‌ఎం, టీచర్లకు సంబంధించి కొత్తగా డీడీఓ కోడ్ నెంబర్లను కేటాయిస్తురు. అలాగే ఆదర్శ పాఠశాలల్లో పీఎస్‌హెచ్‌ఎంలు, ఎస్‌జీటీల వివరాలన్నీ అప్‌డేట్ చేస్తున్నారని, అందరికీ ఈనెలలోనే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు.

- కమిషనర్ ప్రతిరోజూ సమావేశం

పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ నిత్యం ఉదయం పది గంటలకు ఆర్జేడీలు, డీఈఓలు, డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలతో జులై 1వ తేదీ నుంచి వెబెక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ సిబ్బంది, టీచర్లు సమయపాలన పాటించి పాఠశాలల ఉన్నతికి పాటుపడాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జూలై 1వ తేదీ జిల్లాలో 97.5 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)

సమన్వయంతో రొట్టెల పండుగను

విజయవంతం చేయండి

- భక్తులకు ఏలోటూ రానీయొద్దు
- అధికారుల సమీక్షలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగలో విధులు కేటాయించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. పండుగ జరిగే ఐదు రోజులూ 24/7 విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించాలని, సదరు వివరాలను జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ఘాట్‌ల నిర్వహణలో అలసత్వం వహించొద్దని, అవసరమైనన్ని సీసీటీవీలు అమర్చుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం మెరుగు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కలగకుండా చర్యలు తీసుకోవాలని, వైద్య, ఆరోగ్య శాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. దర్గా ప్రాంగణంలో ప్రణాళిక ప్రకారం స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లతో ఆయన కలిసి దర్గా, స్వర్ణాల చెరువు వద్ద ఘాట్‌లను, బారీకేడ్‌ల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.


అధికారుల సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

పంటలకు బీమా.. రైతులకు ధీమా..

ఉదయగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశగ పంటలకు బీమా చేసుకునే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణం పొందిన వారికి బీమా నేరుగా లభిస్తుంది. రుణాలు పొందని రైతులు తుపాన్లు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే వాతావరణ అంశాల ఆధారంగా బీమా పరిహారం చెల్లిస్తారు. వరి, వేరుశనగ పంటలకు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులతోపాటు కౌలు రైతులూ అర్హులని అధికారులు తెలిపారు.

- ప్రీమియం ఇలా..

వరి పంటకు సంబంధించి గ్రామ యూనిట్‌గా రైతులు ఎకరాకు రూ.840 చెల్లించాలి. ప్రకృతి వైపరీత్యాల నష్టం వాటిల్లితే బాధిత రైతుకు రూ.42,000 చెల్లిస్తారు. ఆగస్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఇక వేరుశనగకు మండల యూనిట్‌గా ఎకరాకు రూ.280 ప్రీమియం చెల్లించాలి. రూ.28వేల పరిహారం చెల్లిస్తారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి రైతులను కోరారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



గమ్మళ్లపాళెం వద్ద దుస్థితిలో ఉన్న కల్వర్టు

గూడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. అంతేకాకుండా కల్వర్టులు ధ్వంసమై దుస్థితికి చేరుకోవడంతో కాలువల్లో మురుగుసైతం సక్రమంగా పారుదల లేకపోవడంతో దుర్వాసన వ్యాప్తి చెందడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక గమళ్లపాళెంలోని ఓ వీధికి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కల్వర్టు ధ్వంసమై దుస్థితికి చేరుకుంది. అదేవిధంగా కుమ్మరవీధిలోని ఓ కల్వర్టు అధ్వానంగా మారడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మార్గంలో రాత్రి సమయంలో ప్రయాణించేవారు ధ్వంసమైన కల్వర్టు గుంతలు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాకుండా కాలువల్లో ప్రవహించే మురుగునీటికి ధ్వంసమైన కల్వర్టు శకలాలు అడ్డుగా నిలుస్తుండడంతో దుర్వాసన వ్యాప్తి చెందడంతో పాటు దోమలు పెరిగిపోయి అంటురోగాలు సోకుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దుస్థితికి చేరుకున్న కల్వర్టులను బాగు చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

గూడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆరు సంవత్సరాల నుంచి పదోన్నతలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పదోన్నతులు ఇవ్వాలన్నారు. అలాగే ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లతోనే నడపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, సుబ్రహ్మణ్యం, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాసే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. ఈ కోడ్‌లు అమలులోకి వస్తే 10గంటలకు పైగా పనిచేయాల్సి వస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్, సునీల్, భాస్కర్, వెంకటయ్య, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

'భక్తవత్సలరెడ్డీ కూటమిపై నిందలు మానుకో'



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వాకాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలో ఏమి జరిగినా కూటమిపై నిందలు మోపడం వైసీపీ నేత కొడవలూరు భక్తవత్సలరెడ్డికి అలవాటుగా మారిందని కూటమి నేతలు ధ్వజమెత్తారు. మండలంలోని స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన ఘనత వైసీపీ నాయకులదేనని అన్నారు. భక్తవత్సలరెడ్డి తన స్వగ్రామమైన బాలిరెడ్డిపాళెంలో టీడీపీ నేత రమణయ్యపై పలు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. వాలమేడు, జెమినీ కొత్తపాళెం, గంగన్నపాళెం గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి టీడీపీ శ్రేణులపై దాడులు చేయించిన ఘటనలో ఉప సర్పంచు శ్రీహరికి చేయ్యి విరిగిన విషయం గుర్తు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ దళిత అధికారి అయిన ఏపీవో విజయమ్మను జడ్పీటీసీ రామకృష్ణ, అతని అనుచరులు దుర్భాషలాడి విధులకు ఆటంకం కలిగించేలా ప్రోత్సహించి, వారిపై కేసులు పెట్టించిన ప్రధాన సూత్రదారి భక్తవత్సలరెడ్డేనని ఆరోపించారు. వైసీపీ హయాంలో బాలిరెడ్డిపాళెంలో ఉపాధి పనులే చేపట్టలేదని, కూటమి పాలనలో జరిగే అభివృద్ధి చూసి ఓర్వలేక నిందులు మోపడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ కన్వీనర్ అజిత్‌కుమార్‌రెడ్డి, నాయకులు పంత్రాంగం అరుణ్, తుమ్మల మోహన్ నాయుడు, విన్నమాల ద్వారకనాథ్ రెడ్డి, పేట శ్రీహరి, జనసేన అధ్యక్షుడు శివకోటి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలవంతపు విలీన ప్రక్రియను ఆపాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ, విద్యా వికాస కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత జయచంద్ర మాట్లాడుతూ తడ, కేవీబీపురం, రామచంద్రాపురం, పుత్తూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట మండలాల్లో పాఠశాల విలీన ప్రక్రియపై వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. నాలుగు నెలలుగా పోరాటం చేస్తున్నా మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రక్రియ వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల చదువు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్బర్, రవి పాల్గొన్నారు.

డక్కిలిలో నేడు ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం మధ్యాహ్నం డక్కిలిలో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. రూ.60 లక్షలతో నిర్మించిన మిట్టవడ్డిపల్లి - దేవునివెల్లంపల్లి తారు రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం మివడ్డిపల్లి గ్రామంలో నిర్వహించే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యాక్రమంలో పాల్గొంటారని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హజరై జయప్రదం చేయాలని కోరారు.

ఉచితంగా రేబిస్ టీకాలు

గూడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఈనెల 6వ తేదీన జోనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్ శుక్రవారం తెలిపారు.

ఆధ్యాత్మిక క్షేత్రం ఎదుట ఫ్లెక్సీలా?

చెంగాళమ్మ ఆలయ రోడ్డు డివైడర్లపై కటౌట్లు ● విద్యుత్ స్తంభాలకు కట్టడంతో వైర్లు తెగిపోయి వెలగని లైట్లు



చెంగాళమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

సూళ్లూరుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయం ఎదుట రోడ్డు డివైడర్లపై ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా వెలిశాయి. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్దనున్న నెర్రికాలువ వంతెన నుంచి చెంగాలమ్మ ఆలయం వరకు రోడ్డు, డివైడర్లపై రాజకీయ నాయకులు, ఇతర ఫ్లెక్సీల ఏర్పాటును గత పాలకమండలి నిషేధించింది. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన ఫెక్సీలు మాత్రం ఏర్పాటు చేసుకోవచ్చనని తీర్మానం చేసింది. అప్పటి నుంచి ఆలయం పక్కన ఉన్న రోడ్డులో, పరిసర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంలేదు. రెండు రోజుల క్రితం ఆలయ పక్కనే ఉన్న జీఎన్‌టీ రోడ్డు డివైడర్లపై వీధిలైట్ల స్తంభాలకు ఫ్లెక్సీలు విచ్చలవిడిగా వెలిశాయి. ఆధ్యాత్మిక ప్రాంతంలో ఇదేమి పద్ధతి అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫెక్సీలు విద్యుత్ స్తంభాలకు కట్టడంతో వైర్లు తెగిపోయి పలుచోట్ల వీధి దీపాలు కూడా వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఆలయ రోడ్డులో ఫ్లెక్సీలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

ఎన్డీఏ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సుపరిపాలన: పాశిం



తమ్మినపట్నంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం

చిల్లకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మినపట్నం, లింగవరం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను అధోగతిపాలు చేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేసిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి ప్రతినెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి అందించడం జరుగుతుందన్నారు. దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిండర్లును, తల్లికివందనం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశామన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం తమ్మినపట్నంలో నిర్మించిన సిమెంటు రోడ్డు, లింగవరంలో పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, కోట సతీష్ యాదవ్, వెంకటకృష్ణయ్య, తీగల చంద్రశేఖర్, నెల్లటూరు సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు: విజయశ్రీ



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పది లక్షల కోట్లకు పైచిలుకు అప్పులు చేసేసి వెళ్లినా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌ను అమలు చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం తడ మండల పరిధిలోని కారూరు, పూడి, తడ పంచాయతీల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విజయశ్రీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ఎక్కడ చూసినా గుంతలు పడిన రోడ్లు దర్శనమిచ్చేవని, అభివృద్ధి జాడ కనిపించేది కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయలతో మురికి కాలువలు, రోడ్లను నిర్మించారని అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు, అలాగే పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువస్తూ యేవతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, మరో పదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, సుదర్శన్, పళణి, శ్రీధర్, కళానిధి, రవి, వేలూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టీడీపీ పరిశీలకుడిగా రమేష్



రమేష్‌తో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి తదితరులు

సూళ్లూరుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ నియమితులయ్యారు. శుక్రవారం తిరుపతి 12, 13 క్లస్టర్ పరిధిలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, టీడీపీ నాయకులు మబ్బుదేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న పరిశ్రమలకు సెలవు ప్రకటించాలి

నాయుడుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు జూలై 9వ తేదీన సెలవు ప్రకటించాలని సీఐటీయూ నాయకుడు ముకుంద కోరారు. దేశవ్యాప్తంగా 9వ తేదీ సమ్మెకు సీఐటీయూ పిలుపునివ్వడంతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సహకరించి కార్మికులకు సెలవు ప్రకటించాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న మధుసూదనరెడ్డి

వాకాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి ఎంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి బోర్డు, ఫ్యాన్ అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త శాంతి, ఫౌండేషన్ చైర్మన్ దామా విజయకుమార్ పాల్గొన్నారు.

కేశవరంలో మొహర్రం వేడుకలు



ఊరేగింపునకు సిద్ధంచేసిన పీర్లు

కోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో రెండవ రోజు శుక్రవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. మేళతాళాల మధ్య గుమటం ఊరేగింది. గ్రామస్తులు పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణవనం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన కె.మునీశ్వరికి రూ.1,46,075, టీఎస్ తులసీరామన్‌కు రూ.22,632 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు.

టీడీపీ గ్రామ కమిటీల్లో సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి

దొరవారిసత్రం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ కమిటీల్లో పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ నాయకులు అన్నారు. దొరవారిసత్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్ష పదవికి పోటీపడుతున్న వంకా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ నాయ కులు సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వైసీపీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తూ టీడీపీలో సీనియర్ కార్యకర్తలను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మునీంద్రయ్య, రమణయ్య, రామయ్య, మునిరామయ్య, సుబ్రహ్మణ్యం, ధనుంజయ, రవి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నియోజకర్గంలోని 14 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.15లక్షల 60 వేలు మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శుక్ర వారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీరం రాజేశ్వరరావు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పచ్చూరి నరసయ్య నాయుడు, ఎంపీటీసీ మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెంలో అల్లూరి జయంతి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాలెంలో విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు జరిగాయి. స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని అల్లూరి సీతారామరాజు క్యాంస విగ్రహానికి విద్యార్థులు, హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్‌రఫీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు చేసిన ఉద్యమాలు, విప్లవం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

సూళ్లూరుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధనాలను మానుకోవాలని సీపీఐ నాయకులు సీహెచ్ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాల నాయకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని, దీనిని వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడి కార్మికుల హక్కులను సాధించుకోవాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, 8 గంటల పనిదినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాధాకృష్ణయ్య, రమణయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, బాలు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మురుగు కాలువల్లో పూడికతీత

తడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తడలో పారిశుధ్య లోపం కనబడేది. నిత్యం రహదారుల్లో మురుగునీరు పారుతుండేది. ముఖ్యంగా జాతీయ రహదారికి ఆనుకొని సర్వీస్ రోడ్లపై ఉన్న మురుగుకాలువల్లో ఈ పరిస్థితి ఉండేది. ఏళ్ల తరబడి కాలువల్లోని వ్యర్థాలు పూడికతీయకపోవడంతో జనం ముక్కులు మూసుకుని వెళ్లాల్సి వచ్చేది. అడపాదడపా పంచాయతీ సిబ్బంది శుభ్రంచేసినా రెండు, మూడు రోజుల్లోనే యధావిధి పరిస్థితి నెలకొని రోడ్లపై మురుగు ప్రవహించేది. స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు శుక్రవారం జాతీయ రహదారి అధికారులు కాలువల్లో పూడికతీతకు పూనుకున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన తహసీల్దారు

వెంకటగిరి, జులై 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు నరసింహారావు శుక్రవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

డిపోలో సమస్యలను పరిష్కరించండి

వెంకటగిరి టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలోని సమస్యలు పరిష్కరించాలంటూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్ర, డిపో జోనల్ సంయుక్త కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ సీపీఎస్ సొసైటీలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలన్నారు. నాన్ ఆపరేషన్ యూనిట్లలో సీసీఎస్ డెలిగేట్లను తగ్గిస్తూ, పాలకమండలి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని రద్దు చేసి, ఎన్‌వోయూలో ప్రతి యూనిట్‌కు ఒక డెలిగేట్ పద్ధతిని కొనసాగించాలన్నారు. అలాగే ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించి, వెంటనే 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వైవీ.ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలు, అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఎంపీపీ తనూజారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారయత్నం

నాయుడుపేట టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువతిపై అదే ప్రాంతానికి యువకుడు అత్యాచారయత్నం చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా అత్యాచారయత్నం చేయడంతో ఆ యువతి కేకలు వేసింది. స్థానికులు ఆ యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి జ్యేష్టాభిషేకం

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవింద రాజస్వామి ఆలయంలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. ఏటా ఆషాఢమాసంలో ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. తొలిరోజుఉదయం స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపడతారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, బ్రహ్మఘోష ఇత్యాది కైంకర్యాలు నిర్వహిస్తారు. రెండో రోజు ఉదయం శాస్త్రోక్త కైంకర్యాలు, శాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. చివరిరోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరుమంజనం, సమర్పణ, కవచ ప్రతిష్ఠ, సాయంత్రం కవచ సమర్పణ చేపట్టి మాడవీధుల్లో సర్వాలంకారాలతో ఉత్సవర్లను ఊరేగిస్తారు.